


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in



తులసి గోల్డ్ లోన్
ఫ్రాంచైజీ ఇవ్వబడును.
మీ సొంత బిజినెస్ కు అద్భుత అవకాశం
9247758597, 9666688146



EDITOR: BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME: 18 ISSUE: 122 MONDAY, OCTOBER 12, 2026 PAGES: 12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి : 18 సంచిక : 123 మంగళవారం, అక్టోబర్ 13, 2026, పేజీలు : 12 వెల : 2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


# సీఈసీపై జనాగ్రహం

- పోటెత్తిన యువతరం
- ఢిల్లీలో 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ భారీ ప్రదర్శన
- సుప్రీంకోర్టు వరకు ర్యాలీ..భారీ సంఖ్యలో కదిలివచ్చిన ప్రజానీకం
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ (అడ్డుకున్న పోలీసులు..
- తీవ్ర ఉద్రిక్తత




న్యూఢిల్లీ (తెలంగాణ పత్రిక)
ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దేశ రాజధానిలో నిర్వహించిన ప్రదర్శన విజయవంతమైంది. 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ నేతలు నినాదాలు చేస్తూ సుప్రీంకోర్టు దిశగా కదలగా, వారికి భారీ సంఖ్యలో ప్రజలు తోడయ్యారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ను నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీఎంసీ నేత మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, శివసేన నేత సంజయ్ రౌత్, జెఎంఎం ఎంపీ మహువా మాంఝీ తదితరులు ఈ ప్రదర్శనకు నాయకత్వం వహించారు. వేలాది మంది ఢిల్లీ పోలీసులు, పారామిలటరీ దళాలతో సహా కేంద్ర బలగాలు ప్రయత్నించాయి. అయినప్పటికీ బారికేడ్లను నెట్టుకుంటూ ప్రజలు కదంతొక్కారు.

**బస్సుల్లో బయలుదేరి.. రోడ్లపై భారీ ప్రదర్శన**
ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ నేతలు సమావేశమయ్యారు. అనంతరం నాలుగు బస్సుల్లో సుప్రీంకోర్టు వైపు బయలుదేరారు. అక్కడి నుంచి అశోక రోడ్డు, రైసినా రోడ్డు, ఫిరోజ్‌షా రోడ్డు మీదుగా సాగిన ప్రదర్శన మండీ హౌస్‌కు చేరుకుంది. అనంతరం బారాఖంబా రోడ్ మీదుగా కన్నాట్ ప్లేస్‌కు వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి బారాఖంబా రోడ్డు వద్దకు చేరుకోగా అక్కడ రాహుల్ గాంధీ తదితరులు బస్సు దిగి నడుచుకుంటూ ప్రదర్శన నిర్వహించారు.

## పట్టభద్రుల పోరుకు బీఆర్ఎస్ బిగ్ ప్లాన్

### ఓటర్ల నమోదుపై కేటీఆర్ స్పెషల్ ఫోకస్..!



తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:
రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఈ ఎన్నికలను సెమీఫైనల్స్‌గా భావిస్తున్న గులాబీ పార్టీ రెండు స్థానాల్లోనూ ఘన విజయం సాధించడమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తోంది. ఇందులో భాగంగా పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఉమ్మడి జిల్లాల నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత నాయకత్వ బలంపై ఆధారపడకుండా పార్టీ అధికారిక యంత్రాంగం ద్వారానే ఎన్నికలకు సమాయత్తం కావాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక కంటే ముందే ఓటర్ల నమోదు ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్‌ను నియమించి, నమోదు నుంచి పోలింగ్ ముగిసే వరకు ప్రతి దశను పర్యవేక్షించాలని సూచించారు. కొన్ని నియోజకవర్గాల్లో పనులు మందకొడిగా సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కేటీఆర్, ఇకపై ప్రతి మూడు రోజులకోసారి ప్రగతిని స్వయంగా సమీక్షిస్తానని తేల్చిచెప్పారు. నాయకులు, వారి కుటుంబ సభ్యులు ముందుగా ఓటర్లుగా నమోదు చేసుకొని ఆ వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, నిరుద్యోగుల్లో వ్యక్తమవుతున్న తీవ్ర అసంతృప్తి ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తుందని, ఈ రెండు స్థానాల గెలుపు భవిష్యత్ రాజకీయాలకు దిశానిర్దేశం చేస్తుందని బీఆర్ఎస్ గట్టిగా విశ్వసిస్తోంది.

## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్



న్యూఢిల్లీ (తెలంగాణ పత్రిక)
అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ లకు ఆర్థిక శాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని గెలుచుకున్నారు. ఈ మేరకు సోమవారం స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. స్థూల ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించడంలో సూక్ష్మ ఆర్థిక శాస్త్ర పునాదులపై వారు చేసిన పరిశోధనలకు ఈ పురస్కారం ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించే విధానాలను మరింత సమర్థంగా రూపొందించేం దుకు ఆర్థిక నమూనాలను పునర్నిర్మించవచ్చని ఈ ఇద్దరు పరిశోధకులు నిరూపించారు.

### దసరా ఎఫెక్ట్..

## ఆర్టీసీలో రికార్డు స్థాయిలో ప్రయాణాలు




తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:
దసరాను పురస్కరించుకుని ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దసరా రద్దీ నిర్వహణ, అదనపు బస్సుల ఆపరేషన్లపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సోమవారం అధికారులతో జూమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సర్వీసులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ దసరా సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయిలో సర్వీసులను నడుపుతూ మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించింది. గత ఏడాది (2025) దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడపగా... ఈ ఏడాది అక్టోబర్ 9, 10, 11 తేదీలలో గతంతో పోలిస్తే 495 బస్సులు అదనంగా, అంటే మొత్తం 1,417 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చారు.

## నీటి నిల్వలు, కరెంట్ ఒప్పందాలపై సర్కార్ నిర్లక్ష్యం

### మాజీ మంత్రి హరీష్ రావు



తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:
ఎల్ నినో ఉందని ముందే తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు లిఫ్ట్ చేసి పెట్టుకోలేదని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. దేవాదుల, కల్వకుర్తిలో నీళ్లు లిఫ్ట్ చేసి ఉంటే కరువే ఉండేది కాదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎల్ నినో ఉందని ముందే తెలిసి మిగిలిన రాష్ట్రాలు విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విద్యుత్ ఒప్పందాలు చేసుకోలేదని..నిద్రపోయారా? అని..ఎల్ నినో ఉందని ముందే తెలిసినా బొగ్గు నిల్వలు ఎందుకు పెట్టుకోలేదు? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వైఫల్యం వల్లనే రాష్ట్రంలో విద్యుత్ కోతల పరిస్థితి ఉందని, రైతుల కంటే ముఖ్యమైన అంశం ప్రభుత్వానికి ఏమి ఉంటుంది? అని ప్రశ్నించారు. సింగనూరు ప్రాజెక్టు మరమ్మత్తు చేస్తామని 29 టిఎంసిలు ఖాళీ చేశారని, సింగనూరు ప్రాజెక్టు నీళ్లు ఖాళీ చేసి మరమ్మత్తు చేయకుండా వదిలి పెట్టారని విమర్శించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు ఎలా? అని..కోట్లమందికి తాగునీరిచ్చే సింగనూరు ప్రాజెక్టు పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు? అని ప్రశ్నించారు. ప్రస్తుతం సింగనూరు ప్రాజెక్టులో 3 టిఎంసిలు మాత్రమే ఉన్నాయని, కేవలం 3 టిఎంసిలే ఉన్నా బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తున్నారని హరీష్‌రావు మండిపడ్డారు. బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ..కోట్లమంది ప్రజలపై లేదని, లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రావొద్దని ఆబ్కారీ మంత్రి చెబుతున్నారని అన్నారు. రక్షణశాఖ కంపెనీలు, ఐఐటికి తాగునీరు ఇవ్వలేమని చెబుతున్నారు? అని..తాగునీరు కొరత విషయంలో ప్రభుత్వానికి కార్యాచరణే లేదని హరీష్‌రావు ధ్వజమెత్తారు. జూరాల గేట్లు ఎత్తిన రైతులపై కేసులు పెట్టి జైళ్లో వేస్తున్నారని తాగునీటికి బీరు కంపెనీలకు ఇస్తున్న తమర్ని ఏం చేయాలి? అని నిలదీశారు. రైతుబీమా రాక 3వేల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.

## రైతన్నకు 22ఏ చిక్కులు

- నిషేధిత జాబితాలో ప్రయివేటు భూములు
- రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి భూ యజమానుల అవస్థలు
- పెండింగ్ దరఖాస్తులతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- సర్వే నంబర్ల వారీగా స్పష్టత కరువు..భూమిపై హక్కున్నా..అమ్ముకోలేని దుస్థితి
- తప్పుగా నమోదైన భూములను తొలగించాలని బాధితుల డిమాండ్



తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:
'భూమి ఉంది.. పట్టాదారు పాస్‌బుక్కూ ఉంది.. రెవెన్యూ రికార్డుల్లో పేరుంది.. కానీ అవసరానికి భూమిని అమ్ముకునే అవకాశం లేదు. పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకు, వ్యవసాయ పెట్టుబడులకు భూమిని ఉపయోగించుకునే పరిస్థితి లేదు. కారణం.. రిజిస్ట్రేషన్ల చట్టంలోని 22ఏ నిషేధిత భూముల జాబితా. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రూపొందించిన నిబంధనల అమలులో చోటుచేసుకున్న పొరపాట్లు కొందరు ప్రయివేటు భూ యజమానులకు సమస్యగా మారాయి. సర్వే నంబర్లను పూర్తిగా నిషేధిత జాబితాలో చేర్చడంతో చట్టబద్ధమైన పట్టాలు ఉన్నవారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## రూ. 20 లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ అవినీతి అధికారి



తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్:
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు ఎసిబి అధికారులకు చిక్కారు. అధికారిక పని చేసేందుకు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు వారిని పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్ద అంబర్ పేట్ రెవెన్యూ పరిధిలో ఫిర్యాదు దారుడికి సంబంధించిన భూమిని హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం సర్వే చేసి, జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక జారీ చేసేందుకు అధికారులు లంచం డిమాండ్ చేశారు. రూ. 30 లక్షలు లంచంగా డిమాండ్ చేయగా, చివరకు రూ. 20 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో అక్టోబర్ 12న సాయంత్రం అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామం, మండల పరిధిలో మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు ఫిర్యాదుదారుడి నుంచి రూ. 20 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి సూచనల మేరకే సర్వేయర్ లంచం స్వీకరించినట్లు ఎసిబి ప్రకటనలో పేర్కొంది. లంచం సొమ్మును సర్వేయర్ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. సర్వేయర్ రెండు చేతుల వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షలో పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు వెల్లడించారు. ఇద్దరు అధికారులు తమ విధులను అక్రమంగా, నిజాయితీకి విరుద్ధంగా నిర్వహించినట్లు ఎసిబి పేర్కొంది.

# ఎడారి గడ్డపై బతుకమ్మ జాతర

- మార్మోగిన కేసీఆర్, కేటీఆర్ పాటల హోరు!
- దుబాయ్‌లో అంబరాన్ని అంటిన
- తెలంగాణ ఆడపడుచుల సంబరాలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న
- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త!





తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్: ఎడారి గడ్డపై తెలంగాణ పూల పండుగ పరిమళాలు ఘుమఘుమలాడాయి! పుట్టిన ఊరుకు వేల మైళ్ల దూరంలో ఉన్నా.. గుండెల్లో మాత్రం తెలంగాణ మట్టి వాసనను, ఆత్మగౌరవాన్ని పదిలంగా దాచుకున్న మన ప్రవాస ఆడపడుచులు దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (ఈటీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల వైభవాన్ని ప్రవాస గడ్డపై సగర్వంగా చాటిచెప్పాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, సంప్రదాయ వస్త్రధారణతో ముస్తాబై, చప్పట్ల నడుమ సాగిన ఆటపాటలతో దుబాయ్ వేదికపై అచ్చమైన తెలంగాణ పల్లె వాతావరణాన్ని ఆవిష్కరించారు. ఒకవైపు ఎడారి నగరపు మెరుపులు.. మరోవైపు పూల బతుకమ్మల రంగుల హరివిల్లు! విదేశాల్లో ఉన్నామన్న భావనే రాకుండా, తమదైన శైలిలో వేడుకను జరుపుకుంటూ తెలంగాణ ప్రత్యేక గుర్తింపును విశ్వవ్యాప్తం చేశారు. వేలాదిగా తరలివచ్చిన ప్రవాస సోదర సోదరీమణులతో పండుగ ప్రాంగణమంతా కిటకిటలాడింది.

**మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తకు ఘన సన్మానం!**
ఈ వేడుకలకు తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తను ఈటీసీఏ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. విదేశీ గడ్డపై ఉంటూ కూడా తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటి గొప్పదనాన్ని పరిచయం చేస్తున్న ప్రతినిధులను, వేడుకల్లో పాల్గొన్న ఆడపడుచులను బిగాల గణేశ్ గుప్త అభినందించారు. దుబాయ్‌లో జరుగుతున్న ఈ వైభవాన్ని చూస్తుంటే స్వదేశంలో మన సొంత పల్లెలో ఉన్నామా అన్నంతటి అనుభూతి కలిగిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ప్రవాసంలో ఉన్న తెలంగాణ ప్రజలందరికీ ఆయన బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, మొహమ్మద్ షకీల్, ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల తదితరులు పాల్గొని వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**కేసీఆర్, కేటీఆర్ పాటల జోరు.. దద్దరిల్లిన ఎడారి వేదిక!**
ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మన జానపదాలు, నవ తెలంగాణను నడిపించిన కేసీఆర్, కేటీఆర్‌ల ప్రత్యేక గీతాలే! దుబాయ్‌లోని ఈ సంబరాల్లో గులాబీ శకం తెచ్చిన ఉద్యమ నేత కేసీఆర్‌ను కీర్తించే పాటలు, యువ నాయకుడు కేటీఆర్ నాయకత్వాన్ని ప్రతిబింబించే ఉత్తేజపూరిత గీతాలు మార్మోగాయి. "జై తెలంగాణ.. జై కేసీఆర్.. కారే రావాలి సారే రావాలి మళ్లీ" అంటూ సాగిన నినాదాలు, పాటలతో ప్రాంగణమంతా ప్రతిధ్వనించింది. 'బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ సాగిన లయబద్ధమైన స్వరాలతో పాటు, తెలంగాణ సాధనను, ప్రగతిని గుర్తుచేసే పాటలు అక్కడి వాతావరణాన్ని పండుగ ఉత్సాహంతో నింపేశాయి. ప్రాంతాలు మారినా, దేశాలు దాటినా.. గుండెల్లో నిలిచిన నాయకుల పాటల హోరుతో దుబాయ్ వేదిక దద్దరిల్లింది. ప్రత్యేక రాష్ట్ర సాధన స్ఫూర్తిని, తెలంగాణ సాంస్కృతిక మూలాలను తలపించేలా మహిళలు, కుటుంబ సభ్యులు ఎంతో ఉత్సాహంగా నృత్యాలు చేశారు.

**విదేశాల్లోనూ చెక్కుచెదరని తెలంగాణ సంస్కృతి!**
ఉపాధి, వ్యాపారాల నిమిత్తం దుబాయ్‌లో స్థిరపడిన తెలంగాణ కుటుంబాలన్నీ ఒకచోట చేరి ఈ వేడుకను జరుపుకోవడం ద్వారా భావి తరాలకు మన సంస్కృతిని అందించే గొప్ప ప్రయత్నం చేశారు. పిల్లలకు మన పండుగల విశిష్టతను పరిచయం చేస్తూ, పరాయి గడ్డపై మన సంస్కృతి జెండాను సగర్వంగా ఎగరేశారు. బతుకమ్మ కేవలం పూలను పేర్చి ఆడుకునే వేడుక మాత్రమే కాదు.. అది ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి, మహిళల ఐక్యతకు, తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపునకు ప్రతీక. పూల బతుకమ్మల చుట్టూ మహిళల ఆత్మీయ పలకరింపులు, కేసీఆర్, కేటీఆర్ పాటల జోరుతో సాగిన ఈ సంబరాలు విదేశీ గడ్డపై స్వదేశీ పండుగకు అసలైన కళను తెచ్చాయి. ప్రాంతం మారినా సంప్రదాయం మారదు.. దేశం దాటినా తెలంగాణ బంధం తెగదు! కేసీఆర్, కేటీఆర్ పాటల జోరు ఎక్కడైనా అఖండమే! జై తెలంగాణ! జై జై బతుకమ్మ!

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in



# కోదాడ కోర్టు భవనానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధుల మంజూరు

**ఉత్తమ్ కుమార్ రెడ్డి క్రెడిట్ తీసుకుంటున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శలు**

**కోదాడ, అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక, జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ ):** కోదాడలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు కోర్టుల సముదాయం (ఫోర్ కోర్ట్ కాంప్లెక్స్) భవన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టు విషయంలో క్రెడిట్ తీసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోదాడ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు మరోసారి గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తన ఎమ్మెల్యే పదవీకాలంలో కోదాడ ప్రజలకు మెరుగైన న్యాయ సేవలు అందించాలనే లక్ష్యంతో, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో సుమారు రూ. 25 కోట్ల నిధులతో నూతన కోర్టు భవన సముదాయం మంజూరయ్యేలా కృషి చేసినట్లు మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ 24న నూతన కోర్టు




భవన రూపకల్పన ప్రణాళికను విడుదల చేసిన సందర్భాన్ని ఇందుకు సంబంధించిన ఆధారంగా ప్రస్తావించారు. అదేవిధంగా కోదాడకు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే మంజూరు చేసిందని ఆయన తెలిపారు. గతంలో కోదాడకు మంజూరైన కోర్టును హుజూర్‌నగర్‌కు తరలించుకెళ్లారంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై విమర్శలు చేశారు.

**సోషల్ మీడియా వేదికగా విమర్శలు**

సోషల్ మీడియా యుగంలో అభివృద్ధి పనులకు సంబంధించిన వాస్తవాలను ప్రజల నుంచి దాచలేరని మల్లయ్య యాదవ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆధారాలతో సహా ప్రజల ముందుకు తీసుకువస్తానని స్పష్టం చేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ తక్కువ సమయంలోనే కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని పేర్కొన్నారు. కోర్టు భవన నిర్మాణానికి నిధుల మంజూరు, 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు వంటి అంశాలపై రాజకీయ నేతల మధ్య విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, నిధుల మంజూరు పత్రాలు, నిర్మాణ అనుమతుల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

## గాయత్రి దేవిగా వనదుర్గమ్మ

కన్నుల పండువగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

గోకుల్ షెడ్‌లో అంగరంగ వైభవంగా సాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

నేడు అన్నపూర్ణాదేవిగా అమ్మ దర్శనం







**పాపన్నపేట, అక్టోబర్ 12:(తెలంగాణ పత్రిక):** పాపన్నపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం వన దుర్గామాతను గాయత్రి దేవి రూపంలో, గులాబీ రంగు చీరతో పాటు వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఈ అలంకరణలో అమ్మవారు భక్తులకు శోభయామానంగా దర్శనమిస్తున్నారు. ఆలయ ఆవరణలోని గోకుల్ షెడ్ లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేకువ జాము నుంచే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణధికారి వీరేశం, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నేడు అన్నపూర్ణాదేవి రూపంలో వనదుర్గమ్మ**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వన దుర్గామాత అన్నపూర్ణ దేవి రూపంలో, నీలం రంగు వస్త్రాలతో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని అర్చకులు రావికోఠి పార్థివ శర్మ తెలిపారు.

## తెలంగాణ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ప్రతినిధి అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోసం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన గోదావరిఖనిలో మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ పరీక్షల సన్నద్ధతను అంచనా వేసుకుని, పోటీ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ఈ మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు. అక్టోబర్ 22వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహకంగా మొదటి బహుమతిగా రూ. 10,000, రెండో బహుమతిగా రూ. 5,000, మూడో బహుమతిగా రూ. 2,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 100 మంది అభ్యర్థులకు ఉచిత ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు https://forms.gle/EwsqCLeErjgEPTih6 లింక్ ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7780543055, 8886304040 నంబర్లలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఓపెన్ స్కూల్ సొసైటీ, సెకండ్ స్కూల్ సర్టిఫికెట్

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

పదవ తరగతి పరీక్షకు 82%, ఇంటర్మీడియట్ పరీక్షకు 75% మంది విద్యార్థులు హాజరు

జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద

**పెద్దపల్లి,ప్రతినిధి అక్టోబర్12 (తెలంగాణ పత్రిక):** జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, సెకండ్ స్కూల్ సర్టిఫికెట్, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారదసోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రోజున జిల్లాలోని 02 కేంద్రాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ పరీక్షలలో ఉదయం 10వ తరగతి పరీక్షలకు గాను 45 మంది అభ్యర్థులకు 37 మంది (82%) హాజరయ్యారని, అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు 57 మంది అభ్యర్థులకు గాను 43 మంది (75%) హాజరయ్యారని తెలిపారు. ఇట్టి పరీక్షకు సంబంధించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,ప్రతినిధి అక్టోబర్,12 (తెలంగాణ పత్రిక):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలనిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. రామగుండం మండలానికి చెందిన ధర్ని.మల్లేష్ మండల శివారులోని సర్వే నెంబర్ 287 గల ఏడు గుంటల భూమి పట్టా పాస్ బుక్ లో తన పేరు చేర్చాలని దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ రామగుండం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి మండలం నీరుకుల్లా గ్రామానికి చెందిన ముత్యం. మైసయ్య వృద్ధాప్యంలో తన కుమారులు తన బాగోగులు చూసుకోవడం లేదని దరఖాస్తు చేసుకోగా ఆర్డీఓ పెద్దపల్లికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన పోయిలా. కృష్ణ న్యాక్ లో ప్లంబర్ శిక్షణ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నానని, తనకు ఉద్యోగ అవకాశంకల్పించాలని దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన మహమ్మద్. జిలాని తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలి



**నంగునూరు, అక్టోబరు 12(తెలంగాణ పత్రిక):** బీఆర్ఎస్ నేతలు తమ కుటుంబ ప్రయోజనాలు, అవినీతి అక్రమాల కోసమే సిద్దిపేట ప్రజలు మరోసారి ఉద్యమం చేయాలని పిలుపును ఇస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నట్లు చెబుతూ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ప్రజలను, నిరుద్యోగులను ఉద్యమంలోకి తీసుకు వచ్చారని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమకారులకు, నిరుద్యోగులకు అన్యాయం చేశారని విమర్శించారు. తమను ప్రశ్నించిన వారిపై బీఆర్ఎస్ నాయకులు అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు సంబంధించిన అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలు పడకూడదనే ధోరణితో బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని కూర జైపాల్ రెడ్డికి టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని యాదగిరి ఆరోపించారు. ఈ విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. సిద్దిపేట నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తీసుకున్న చర్యలేమిటో బీ ఆర్ ఎస్ నాయకులు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలు, సాగునీరు, విద్యుత్ సరఫరా, నిరుద్యోగం వంటి అంశాలపై రాజకీయ నాయకులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని యాదగిరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగుల రవి, మాజీ సర్పంచ్ చేర్యాల బాలయ్య, భాస్వరాజ్ రాములు, పంగ రాజశేఖరరెడ్డి, సుద్దాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ నుంచి శబరిమలకు మూడోసారి మహా పాదయాత్ర

రెండుసార్లు అయోధ్య కరసేవలో పాల్గొన్న మామిడిపెల్లి లక్ష్మణ్

ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తి కూడా అవసరం: లక్ష్మణ్



**రాయికల్ మండల అక్టోబరు 12(తెలంగాణ పత్రిక ):** అయ్యప్ప స్వామిపై అపారమైన భక్తి విశ్వాసాలతో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మామిడిపెల్లి లక్ష్మణ్ సోమవారం రాయికల్ నుంచి శబరిమలకు మహా పాదయాత్ర చేపట్టారు. అయ్యప్ప స్వామి దర్శనం కోసం కాలినడకన బయలుదేరిన ఆయనకు ఇది మూడోసారి పాదయాత్ర కావడం విశేషం. 'స్వామియే శరణం అయ్యప్ప' అనే నామస్మరణతో భక్తిశ్రద్ధల మధ్య తన యాత్రను కొనసాగిస్తున్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ లక్ష్మణ్ ఈ పాదయాత్ర చేపట్టారు. భక్తి, పట్టుదల, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా ఆయన యాత్ర సాగుతోంది. కాగా, మామిడిపెల్లి లక్ష్మణ్ గతంలో రెండుసార్లు అయోధ్యకు కరసేవకుడిగా వెళ్లి వచ్చారు. అయోధ్యలో భవ్యమైన రామమందిరం నిర్మాణం జరగడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. కరసేవకుడిగా రామమందిర నిర్మాణాన్ని చూడటం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతి మనిషికి ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తి కూడా అవసరమని లక్ష్మణ్ అన్నారు. దేశం, ధర్మం బాగుంటేనే ఇవన్నీ బాగుంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. భక్తితో పాటు దేశం పట్ల బాధ్యత, ధర్మం పట్ల నిబద్ధత ప్రతి ఒక్కరిలో ఉండాలని పేర్కొన్నారు. మూడోసారి శబరిమలకు పాదయాత్ర చేపట్టిన లక్ష్మణ్ ప్రయాణం విజయవంతం కావాలని గ్రామస్థులు, కరసేవకులు, అయ్యప్ప భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

## ఎన్నికల ప్రధాన అధికారి రాజీనామా చేయాలి

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలి

దమ్మపేటలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవి నుంచి వైదొలగాలి

ఎన్నికల సంఘం పనితీరులో సమూల మార్పులు తీసుకురావాలి

ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి



**తెలంగాణ పత్రిక దమ్మపేట అక్టోబర్ 12:** ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని, అలాంటి సంస్థలో పక్షపాత ధోరణులకు తావివ్వకుండా చూడాల్సిన బాధ్యత ప్రధాన ఎన్నికల అధికారిపై ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ లక్ష్మీనారాయణ అన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తీరును నిరసిస్తూ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం దమ్మపేట స్థానిక కూడలిలో రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలకలు ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ అని, ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమాన హోదా కలిగి ఉన్నప్పటికీ, ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకించిన అంశాలపై కూడా ప్రధాన అధికారి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, నిరంకుశ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం మత ప్రాతిపదికన పౌరసత్వ విధానాలను అమలు చేసేందుకు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అడ్డదారిగా ఉపయోగించుకుంటోందని వారు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల సంఘం పనితీరులో సమూల సంస్కరణలు చేపట్టాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేషబాబు, కవులూరి రామకృష్ణ, చీకటి లక్ష్మీనారాయణ, బాబురావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోసం ఎదురుచూపులు.. ఎండలో రైతు అవస్థలు!

విద్యుత్ సరఫరా కోసం చెట్టు నీడన సేదతీరుతున్న అన్నదాత

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై రైతుల ఆవేదన



**సూర్యాపేట,తెలంగాణ పత్రిక, అక్టోబర్ 12 , జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ :** వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఎదురుచూస్తూ, ఎండ వేడిని తట్టుకోలేక ఓ రైతు పామాయిల్ చెట్టు నీడన పడుకున్న దృశ్యం అన్నదాతల కష్టాలను కళ్లకు కడుతోంది. సోమవారం, అక్టోబర్ 12, 2026న చోటుచేసుకున్న ఈ దృశ్యం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తోంది. పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ సరఫరాపై ఆధారపడే రైతులు, కరెంటు కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు విద్యుత్ కోసం నిరీక్షణ.. రైతులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇలాంటి దృశ్యాలు తెలంగాణలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్నాయంటూ రైతుల సమస్యలపై చర్చ జరుగుతోంది. వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితిని ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రైతుల ప్రశ్న ఒక్కటే.. పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ కోసం ఎదురుచూడాలా? లేక ఎండలో అవస్థలు పడుతూ వ్యవసాయం కొనసాగించాలా? రైతుల సమస్యలపై ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులు స్పందించి, విద్యుత్ సరఫరా విషయంలో స్పష్టతనిస్తూ అన్నదాతలకు ఉపశమనం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

## ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ



**నిర్మల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** నిర్మల్ కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సోమవారం నెలవారీ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంలోని రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక వ్యవస్థల సన్నద్ధతను సమీక్షించారు. ఈవీఎం గోదాం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. పోలీసు సిబ్బంది సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని సూచించారు. ఈ తనిఖీలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్,డీపీఆర్వో ఇ. విష్ణువర్ధన్,తహసీల్దార్ రాజు,అధికారులు స్వాతి, పోలీసు,అగ్నిమాపక శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Epaper.Telanganapatrika.in



# ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**దమ్మపేట మండల ప్రజావాణిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**

**ఎల్‌నినో ప్రభావంతో నీటి వనరులపై ప్రత్యేక నిఘా**

**మండలంలోని 230 చెరువుల నీటి నిల్వలపై సమీక్ష**

**గ్రామాల్లో ప్రజావాణిపై విస్తృత ప్రచారం నిర్వహించాలి**




**తెలంగాణ పత్రిక దమ్మపేట, అక్టోబర్ 12:** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరిస్తూ, నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

**నీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలి**

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో మండలంలో తాగునీటి సరఫరా, చెరువుల నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల పరిధిలోని 230 చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వల వివరాలను నీటిపారుదల శాఖ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, చెరువుల్లో నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

**రైతులకు అవసరమైన సూచనలు అందించాలి**

రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమాలకు హాజరవుతున్న రైతుల సంఖ్య, వారికి అందిస్తున్న సలహాలు, సూచనల గురించి ఆరా తీశారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులకు ముందస్తు సూచనలు అందించాలని అధికారులకు తెలిపారు.

**భూ సర్వేలను సమన్వయంతో పూర్తి చేయాలి**

అటవీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న సంయుక్త భూ సర్వేల పురోగతిపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశిత విధానాల ప్రకారం సర్వేలను చేపట్టాలని సూచించారు. సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గ్రామాల్లో ప్రజావాణిపై విస్తృత ప్రచారం చేపట్టాలి**

మండల ప్రజావాణికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతున్న విషయంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి వారం ఎంతమంది ప్రజలు దరఖాస్తులు సమర్పిస్తున్నారు, మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రానికి ఎందుకు వెళ్తున్నారనే వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మండల స్థాయిలోనే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉందనే విషయాన్ని తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రజావాణి కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, యువత సహకారంతో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో దమ్మపేట తహసీల్దార్ మురళి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## సత్యసాయి మందిరంలో పిల్లలకు ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం





**మందమర్రి మండలం (రామకృష్ణాపూర్): తెలంగాణ పత్రిక:** రామకృష్ణాపూర్ లోని సత్యసాయి మందిరంలో పిల్లలకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమాన్ని సత్యసాయి సేవా సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పతాక ఆవిష్కరణ చేయగా సింగరేణి కాలరీస్ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి రాజా రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి పుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలు మొబైల్ కి బానిసలుగా మారి విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని మానసిక రుగ్మతలకు గురి అవుతున్నారని అన్నారు. మన దేశ సంస్కృతి వైభవం చరిత్రను నేటి భావితరాల పిల్లలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు ఇలాంటి ఆధ్యాత్మిక శిక్షణ శిబిరాల వలన పిల్లల్లో మానసిక ధైర్యం ఆధ్యాత్మిక చింతన పట్ల శ్రద్ధ విశ్వాసం ఏర్పడతాయని అన్నారు. ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో దూరప్రాంత పిల్లలకు ఉచిత వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే పిల్లలకు అవసరమైన యోగ, ఆరోగ్య భద్రత, సత్ప్రవర్తన, ఆధ్యాత్మిక చింతన వంటి విషయాలపై పిల్లలకు నేర్పించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోషుల నాగరాజు కాంతారావు గణేష్ హనుమంత రెడ్డి జిల్లా సమన్వయకర్తలు సత్యసాయి సేవా సమితి రామకృష్ణాపూర్ సేవాదళ్ సభ్యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బీరుపూర్ శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి 3వ గిరి ప్రదర్శన



**బీరుపూర్, అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా బీరుపూర్ మండల కేంద్రంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మి నరసింహా స్వామి రెండవ గిరి ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ చీర్నెని శ్రీనివాస్ ఆలయ కార్యనిర్వహణ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు రథశాల నుండి మొదలుపెట్టి ప్రదర్శనను భక్తులు భక్తి శ్రద్ధాలతో చేపట్టారు. శ్రీ లక్ష్మి నరసింహా స్వామి జన్మ నక్షత్రం అయిన ప్రతి నెల స్వాతి నక్షత్రంన తప్పకుండ గిరి ప్రదర్శన ఉంటుందని భక్తులందరు భక్తి శ్రద్ధాలతో గిరి ప్రదర్శనలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంతోష్ మధు చిన్న సంతోష్ దర్శకుర్తి రమేష్ పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కమిటీకి ఎన్నికైన వాంకుడోత్ అమర్ సింగ్



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** అక్టోబర్ 10, 11 తేదీలలో హైదరాబాద్ మహానగరంలో జరిగిన తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్రనాలుగవ మహాసభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన సంఘం అధ్యక్షులు వాంకుడోత్ అమర్ సింగ్ మరియు కే.షణ్ముఖ, భానోత్ మధు ముగ్గురికి రాష్ట్ర కమిటీ లో ఎన్నుకోవడం జరిగింది, ఈ సందర్భంగా అమర్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ తనపై ఉంచిన నమ్మకంతో బాధ్యతయుతమైన కార్యకర్తగా ఏజెన్సీ జిల్లా అయినా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన ప్రజలకు వారి యొక్క హక్కులు కాపాడడానికి వారి సమస్యల పరిష్కారానికి అనునిత్యం ఐక్య గిరిజన ఉద్యమాలు నిర్మించి ఈ జిల్లాలో ఉన్న గిరిజన చట్టాలను కాపాడడానికి పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొనడం జరిగింది, అదేవిధంగా గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేస్తూ, భవిష్యత్తు కర్తవ్యాల పై రాష్ట్ర కమిటీ ఇచ్చే పిలుపులను ఈ జిల్లాలో అమలు చేస్తామని పేర్కొన్నారు.

## నూతన భవనంలోకి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

**ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందించాలి**

**సీనియర్ రీజినల్ మేనేజర్ రిషికేష్ రంజన్ కుమార్**



**ఆత్మకూరు, అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** ఆత్మకూరు పట్టణంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖ నూతన భవనంలోకి మారడంతో సోమవారం బ్యాంకును లాంఛనంగా పునఃప్రారంభించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సీనియర్ రీజినల్ మేనేజర్ రిషికేష్ రంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు సేవలు, ఖాతాదారులకు అందిస్తున్న సదుపాయాలపై ఆయన వివరించారు.

**ఖాతాదారులకు నాణ్యమైన సేవలే లక్ష్యం**

ఈ సందర్భంగా సీనియర్ రీజినల్ మేనేజర్ రిషికేష్ రంజన్ కుమార్ మాట్లాడుతూ, బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ పనిచేస్తోందని తెలిపారు. ఖాతాదారులకు సౌకర్యవంతమైన వాతావరణంలో సేవలు అందించేందుకు బ్యాంకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. బ్యాంకుకు వచ్చే ప్రతి ఖాతాదారుడికి మర్యాదపూర్వకంగా స్పందిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.

**బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

ఆత్మకూరు పరిసర గ్రామాల ప్రజలు, ఖాతాదారులు బ్యాంకు అందిస్తున్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సేవలందించేందుకు బ్యాంకు ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. నూతన భవనంలో బ్యాంకు కార్యకలాపాలు కొనసాగడం ఖాతాదారులకు మరింత అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మోకన అనుపమ, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## శ్రీ విజ్ఞాన్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**రాజేంద్రనగర్ ప్రతినిధి అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పట్టణంలోని శ్రీ విజ్ఞాన్ జూనియర్,డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ పాటలతో సాంస్కృతిక ఆటపాటలతో కోలాటలాడుతూ అలరించారు. బతుకమ్మ వేడుకలతో కళాశాల ప్రాంగణమంతా సందడిగా నెలకొంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు విద్యావంతుల ఓట్లు అడిగే హక్కు లేదు: రాజయ్య



**ధర్మసాగర్, అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యావంతుల ఓట్లు అడగడం సరికాదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యావంతుల ఓటు నమోదు మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో సాగునీరు, తాగునీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. దళితులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు.

## రబీ సీజన్ సాగుకు ఎల్ నినో ప్రభావం



**ముధోల్: 12అక్టోబర్(తెలంగాణ పత్రిక):** రాబోయే రబీ సీజన్ సాగులో వర్షభావ పరిస్థితులు లేవని పంటలపై ఎల్ నినో ప్రభావం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి రచన, నాయకులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రబీ పంటలు సాగు చేయవద్దన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతవరకు అధిగమించవచ్చన్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు ప్రజల తాగునీటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీరు, విద్యుత్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడం అందరి బాధ్యత ఉందని రైతు నేస్తం ద్వారా రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురు చరణ్, కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు పతంగి కిషన్, మాజీ ఎంపీటీసీ రావుల గంగారెడ్డి, ఏఈఓ లు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సమస్యలపై ప్రజావాణిలో పిర్యాదు చేసిన గ్రామస్తులు



**కల్వకుర్తి అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక**

తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండలప్రజాపరిషత్ లోని ఎంపీడీఓ కి గ్రామస్తులు పడకల్ నుంచి తలకొండపల్లి వరకు పాదయాత్రచేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ లో వోల్టేజ్ సమస్య పశువులకు వైద్య సేవలు అందించేందుకు పశువైద్యుడు అందుబాటులో లేడు విద్యార్థుల కు సరైన బస్సు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. దానితో పాటుతలకొండపల్లి నుంచి పడకల్ వయా రావిచ్చేడు వరకు రోడ్డు విస్తరణ, మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పెంటయ్య దేవుని పడకల్ సర్పంచ్ శ్రీమతి అనిత మల్లేష్ మాజీ సర్పంచ్ రమేష్ వార్డు మెంబర్స్ చౌటి విజయ్ కుమార్ విమల రవి నరసింహ రమేష్ జైహిందు పర్వతాలు బాబు రెడ్డి రాఘవేందర్ మహేష్ మణి వర్ధన్ నైతిక్ కుమార్ జంగయ్య చెన్నయ్య కాన్సిరాం తదితరులు పాల్గొన్నారు.

## నూకాలమర్రిలో పంచాయతీ, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందికి బతుకమ్మ కానుకలు

**రోమాల ప్రవీణ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ**

**ముఖ్యఅతిథిగా ప్యాక్స్ చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్**



**వేములవాడ రూరల్, అక్టోబర్, 12, తెలంగాణ పత్రిక:** వేములవాడ గ్రామీణ మండలం నూకాలమర్రి గ్రామంలో గ్రామ సేవకులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రోమాల ప్రవీణ్ ఆధ్వర్యంలో బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేములవాడ సింగల్ విండో (ప్యాక్స్) చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రోమాల ప్రవీణ్ మాట్లాడుతూ. సమాజానికి, గ్రామానికి విశేష సేవలందిస్తున్న పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజా సంక్షేమంలో భాగస్వాములవుతున్న వారందరికీ పండుగ పూట చిరుకానుక అందించడం సంతోషంగా ఉందని, ఈ బతుకమ్మ పండుగ వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి పరశురాములు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సామల్ల రాజు, ఉప సర్పంచ్ పాలకుర్తి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ బొడ్డు రాములు, మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శి పొట్ల మధు, వార్డు మెంబర్లు గాంధీ–భాగ్య, రాజు నాయక్, కొమ్ము రణధీర్, బొడ్డు సుధీర్, రోమాల సురేష్, సుల్తాన్ పరశురాములు, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు పొత్తూరి నరసయ్య, పద్మ, నాయకులు రోమాల దేవయ్య, మెదుదుల పరశురాం, తిరుపతి, కమలాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# శంషాబాద్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**రాజేంద్రనగర్ ప్రతినిధి అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక:** శంషాబాద్ పట్టణంలో ఆదివారం నాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొలను ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ హోంశాఖ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి హాజరై మహిళలకు, ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని పూజిస్తూ పూలతో తల్లి బతుకమ్మను ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి, మన సాంస్కృతిక వారసత్వానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మన పండుగలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. శంషాబాద్ పట్టణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, ఆడపడుచులు పాల్గొని తమ బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, సాంస్కృతిక సందడి ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కొలను ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ప్రజలందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## వేములవాడ పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల కమలాకర్



**వేములవాడ, అక్టోబర్, 12, తెలంగాణ పత్రిక:** వేములవాడ పట్టణ బీజేపీ నూతన ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల కమలాకర్ నియమితులయ్యారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బీజేపీ పదవుల కోసం కాకుండా సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే పార్టీ అని, గత 15 ఏళ్లుగా పార్టీ అభివృద్ధికి కమలాకర్ అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. గతంలో ప్రధాన కార్యదర్శిగా ఉన్న బోనాల శివ ప్రస్తుతం కౌన్సిలర్‌గా కొనసాగుతుండటంతో ఆ స్థానంలో కమలాకర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో పార్టీని బలోపేతం చేస్తూ తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఐడీఓసీ ప్రజావాణికి 129 దరఖాస్తుల రాక

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్, 12, తెలంగాణ పత్రిక:** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 129 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజావాణి కి వచ్చే దరఖాస్తులు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 07 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 01 దరఖాస్తు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల్లో స్వీకరణ. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓ లు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించార. మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు.. బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 0, చందుర్తి మండలం 0, ఇల్లంతకుంట మండలం 0, గంభీరావుపేట మండలం 04, కోనరావుపేట మండలం 0, ముస్తాబాద్ మండలం 02, రుద్రంగి మండలం 0, తంగళ్లపల్లి మండలం 02, వీర్నపల్లి మండలం 01, వేములవాడ అర్బన్ మండలం 03, వేములవాడ రూరల్ మండలం 02, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 01 చొప్పున వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగు తుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి



**మెదక్ జిల్లా చిన్న శంకరంపేట ( తెలంగాణ పత్రిక ) అక్టోబర్ 12:** చిన్న శంకరంపేట మండల కేంద్రంలో కబడ్డీ ప్రీమియర్ లీగ్ (కె.పి.ఎల్) సీజన్-1 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కుమార్, ప్రవీణ్, పప్పు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా సంబరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి టాస్ వేసి అధికారికంగా ప్రారంభించారు. క్రీడలను ప్రోత్సహిస్తూ పోటీలను ప్రారంభించిన రాజిరెడ్డిని గ్రామస్తులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కాసేపు రాజిరెడ్డి గ్రామస్తులు కబడ్డీ ఆట ఆడారు, ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులంతా కక్షపూరిత ధోరణి వీడి, క్రీడా స్ఫూర్తితో ఆడాలని, అంపైర్ల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో కొంతమంది యువకులు గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, తమ దృష్టిని క్రీడల వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఆటల్లో కష్టపడి రాణించడం ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మంచి గుర్తింపు తెచ్చుకుని, ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రవి, గ్రామ ప్రముఖులు మేడి గణేష్, శ్రీనివాస్, కుమ్మరి మహేష్, నల్ల కుమార్లతో పాటు పెద్ద సంఖ్యంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గంగాధర క్షేత్రంలో రెండో రోజు గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం



**ఇల్లంతకుంట, అక్టోబర్ 11 తెలంగాణ పత్రిక:** ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక కుంకుమ అర్చనలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, గ్రామ ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మ తెలిపారు. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కావున మండల ప్రజలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ప్రారంభం

జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే





**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్, 12, తెలంగాణ పత్రిక:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా చందుర్తి మండలం లింగంపేట్ గ్రామ శివారులోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అక్టోబర్ 21 నుంచి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవమైన అక్టోబర్ 31 వరకు పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడాం జరుగుతుదన్నారు. కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాలు:ఓపెన్ హౌస్ కార్యక్రమాలు:పోలీసుల విధులు, త్యాగాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. రక్తదాన శిబిరాలు:పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం రక్తదాన శిబిరాలను నిర్వహించడం జరుగుతుంది. ర్యాలీలు:పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించడం జరుగుతుంది. కొవ్వొత్తుల ర్యాలీలు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించి వారికి నివాళులర్పించడం జరుగుతుంది. అమరవీరుల కుటుంబాలకు పరామర్శ. పోలీస్ అమరవీరుల కుటుంబాల వద్దకు వెళ్లి, దేశం మరియు ప్రజల రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించడం జరుగుతుంది. వ్యాసరచన పోటీలు.. (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో.. )కేటగిరి - 1ఇంటర్మీడియట్ వరకు విద్యార్థిని విద్యార్థుల కోసం. 1. సైబర్ నేరాల నివారణలో పోలీసుల - పౌరుల పాత్ర. 2. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర.... విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు. కేటగిరి -2 డిగ్రీ మరియు ఆపై చదువుతున్న విద్యార్థుల కోసం. 1. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర. 2. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర. పోలీస్ అధికారులకు.. కేటగిరి -1 కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు.. 1. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు2. పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర - సోషల్ మీడియా కు బానిస కాకుండా ఉండటం మరియు వ్యక్తిగత మరియు సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవటం ఎలా. కేటగిరి - 2 ఎస్.ఐ మరియు పైస్థాయి అధికారులు.. 1. పౌరుల మన్ననలు పొందటానికి పోలీసులు చేయవలసిన కృషి. 2. నెలస్థాయి పోలీసు వ్యవస్థ బలోపేతం చేయడం ఎలా. ఈవ్యాసరచన పోటీలను తెలుగు ఇంగ్లీష్ ఉర్దూ భాషలలో నిర్వహించాలని, 500 పదాలకు మించకుండా వ్యాసరచనలో పాల్గొని, ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుందని తెలియజేశారు. షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు. జిల్లా పరిధిలోని విద్యార్థినీ, విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. పోలీసుల సేవలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవలు, పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే ఇతర అంశాలపై ఫోటోలు, వీడియోలను రూపొందించవచ్చు. షార్ట్ వీడియోలు మూడు నిమిషాలకు మించకుండా రూపొందించాలి. ఉత్తమంగా నిలిచిన ఫోటోలు, వీడియోలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయబడతాయి. ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ ఫోటోలు, వీడియోలను అక్టోబర్ 24వ తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ పీఆర్వోకు అందజేయాలి. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు బహిరంగ ప్రదేశాల్లో పోలీస్ కళాబృందం ద్వారా అమరవీరుల త్యాగాలను వివరిస్తూ పాటల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

## దేవునూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



**ధర్మసాగర్, అక్టోబర్ 12 ( తెలంగాణ పత్రిక):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హింగే రవీందర్, ఇందిర, ఉపసర్పంచ్ రాంపాక రాజు, రజిత, విగ్రహ దాత, గౌరవ అధ్యక్షుడు చిట్యాల పెద్ద రవీందర్ పాల్గొన్నారు. వార్డు సభ్యులు రుద్రారపు సురేఖ, చిట్యాల రాజమౌళి, పొడిశెట్టి అనూష, కుల పెద్దలు కనకం శేఖర్, రుద్రారపు శ్రీనివాస్, చిట్యాల బాలస్వామి హాజరయ్యారు. అలాగే బీజేపీ నాయకుడు మొరే రాజేందర్, అంబేద్కర్ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు, స్వాతంత్ర్య సమరయోధుడు హింగే చందరరావు, అడ్వకేట్ చిట్యాల రమేష్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిట్యాల మల్లయ్య, లెక్చరర్ కొలిపాక మధు, ఉపాధ్యాయుడు చిట్యాల దిలీప్, పొడిశెట్టి జర్జీ తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చిట్యాల రాజు, యువజన సంఘం సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావ ఉపశమానికి ఆరుతడి పంటలు మేలు చేస్తాయి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






**నిర్మల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** ఆరుతడి పంటల సాగుతో ఎల్ నినో ప్రభావానికి ఉపశమనం లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ఇతర ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులతో కలిసి అన్ని రైతు వేదికల ద్వారా కలెక్టర్లు, అధికారులు, రైతులతో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా తీవ్రంగా ఉందని, రైతులంతా తక్కువ నీటితో, స్వల్ప కాలంలో పండే పంటలను మాత్రమే సాగు చేయాలని అన్నారు. వర్ష భావ పరిస్థితుల వల్ల రైతులు సాగు చేసిన పంటలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని, దిగుబడులు పూర్తిగా తగ్గాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రైతులు నూనె గింజలు, పప్పు దినుసులు సాగు చేయాలని సూచించారు. నూనె గింజల్లో వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమలు, నువ్వుల పంటలతో పాటు, పప్పు దినుసుల్లో పెసర్లు, మినుములు, శనగలు, కందుల రకాలు సాగు చేయాలని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు కూడా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా ఇటువంటి పంటలను పండిస్తే భూసారం కూడా పెరుగుతుందని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు అందరూ కలిసికట్టుగా ఎల్ నినో ముప్పును ఎదుర్కోవాలని చెప్పారు. జాబ్ కార్డులు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ విబిజి రామ్ జీ పథకం కింద పని పొందాలని పిలుపునిచ్చారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. విద్యుత్ వినియోగం కూడా గత ఏడాదితో పోలిస్తే పెద్ద ఎత్తున పెరిగిందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. తదనుగుణంగా రైతులు, అధికారుల సూచనల మేరకు తమ పంట సాగు ప్రణాళికలు చేసుకోవాలన్నారు. అధికారులంతా రైతులను కలుస్తూ వాతావరణ పరిస్థితులు, పంట సాగు వివరాలు వెల్లడించి, ఆరుతడి పంటల సాగువైపు వారిని ప్రోత్సహించాలన్నారు. వాస్తవ పరిస్థితులని వారికి వివరించాలని తెలిపారు. నిర్మల్ గ్రామీణ మండలం న్యూ పోచంపాడ్ రైతు వేదిక నుంచి ఈ రైతునేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వల్ప కాలంలో, తక్కువ తడులతో పండే పంటలు పండించేందుకు ముందుకు రావాలన్నారు. పప్పు దినుసులు, నూనె గింజల పంటలు పండించడం వల్ల రైతులు వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోకుండా ఉంటారని పేర్కొన్నారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ విబిజి రామ్ జీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు అధికారుల సేవలు వినియోగించుకోవాలని వివరించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు పండించాలని తెలిపారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో రైతులు అధికారుల సూచనలు పాటిస్తే మేలు కలుగుతుందని వివరించారు. ఈ రైతు నేస్తం కార్యక్రమంలో ఉద్యానవన పంటల అధికారి రమణ, డిఆర్డిఓ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపిడివో సుధాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు భీమ్ రెడ్డి, షిండే ఆనంద్ రావు పటేల్, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలి

- తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- ప్రపంచ వ్యాప్తంగా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం
- నీరు అందుబాటులో లేకుంటే సాగుకు దూరంగా ఉండాలి
- ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- మనుషులతో పాటు పశుసంపదను కాపాడుకోవాలి.. మేత, తాగునీటి ఏర్పాట్లు చేయాలి
- కష్టకాలంలో అధికారులకు సహకరించాలి
- వారి సూచనలను రైతులు పాటించాలి
- కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**పెద్దపల్లి, ప్రతినిధి అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని, అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులతో మాట్లాడి యాసంగి 202627 పంటల సాగు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలోని రైతు వేదిక నుంచి నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని రైతు వేదికల నుంచి రైతులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ...** రాష్ట్రంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడం, సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో రైతులు యాసంగి 202627 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ లభ్యతకు సంబంధించిన సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాస్తవాలను అర్థం చేసుకుని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సాగునీరు అందుబాటులో ఉంటుందనే అంచనాతో అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేసి నష్టపోకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ, రానున్న జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి పథకాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉండటంతో పాటు భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు సాగు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలను పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ...** సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గి, కరువు పరిస్థితులు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ ప్రభావం మరింత బలపడవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఖరీఫ్ సాగు విస్తీర్ణం 15 శాతం తగ్గిందని వివరించారు. పత్తి, వరి పంటలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని తెలిపారు. 30 టీఎంసీల సామర్థ్యం ఉన్న సింగూరు జలాశయంలో సుమారు 4 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 20 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసినప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత నెలకొన్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రైతు భరోసా కింద 75 లక్షల మంది రైతులకు రూ. 8,500 కోట్ల నిధులు విడుదల చేశామని, లక్ష ఎకరాలకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశామని, ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనాలు అందించామని వివరించారు.

**ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి**

కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సమస్యలు తలెత్తకుండా ఉపాధి హామీ పథకం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని సీఎస్ సూచించారు. గత ఏడాది రోజుకు సగటున 25 వేల మంది కూలీలు పనులకు హాజరుకాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందని తెలిపారు. నెలాఖరుకు రోజువారీ కూలీల హాజరును 5 లక్షలకు పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు పని కల్పించేలా నీటి సంరక్షణ పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి నిల్వ నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, వ్యక్తిగత, సామూహిక సోక్ పిట్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని సూచించారు. పశువులకు మేత అందుబాటును పెంచే పనులను కూడా ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాలని తెలిపారు.

**పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ..** సింగూరు పరిధిలోని 19 పట్టణాలు, సుమారు 2 వేల ఆవాసాలకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు డిసెంబర్ 10 వరకు అవసరాలు తీర్చేందుకు సరిపోతుందని, ఆ తర్వాత కూడా సరఫరాలో ఇబ్బందులు రాకుండా రూ. 110 కోట్లతో ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించామని, ఈ వారంలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు, అక్టోబర్‌లో జిల్లాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు.

**ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ...** సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు దేశవ్యాప్తంగా విద్యుత్ లభ్యత గణనీయంగా తగ్గుతోందని తెలిపారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాల్లో గతంలో 3,750 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, ఈ ఏడాది సుమారు 930 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి అయిందని వివరించారు. పగటిపూట విద్యుత్ అవసరాలను తీర్చగలుగుతున్నప్పటికీ, రాత్రి పీక్ అవర్స్‌లో కొంత కొరత ఉంటోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతో పాటు మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. 3,000 మెగావాట్ల బ్యాటరీ నిల్వతో కూడిన సౌర విద్యుత్ ప్రాజెక్టు, 2,000 మెగావాట్ల రౌండ్-ది-క్లాక్ పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు, 800 మెగావాట్ల బ్యాటరీ నిల్వ ప్రాజెక్టు సహా నాలుగు ప్రధాన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**భారత వాతావరణ శాఖ నిపుణురాలు డాక్టర్ ఎ. శ్రావణి మాట్లాడుతూ...** ప్రస్తుతానికి తెలంగాణలో చెప్పుకోదగిన వర్షాలు కురిసే అవకాశం లేదని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఈశాన్య రుతుపవనాల ప్రభావం రాష్ట్రంపై చాలా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అక్టోబర్ నుంచి నవంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి ప్రసాద్, డి సి ఓ శ్రీ మాల, ఎస్సీ ఎన్పీడీసీఎల్ గంగాధర్ ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





## గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుసుకున్న ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పో



**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబరు 12:** ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 7 దరఖాస్తులు అందాయి. ఆర్సీవో, మహబూబాబాద్‌కు సంబంధించి 3 దరఖాస్తులు అందాయి. వీటిలో ఉద్యోగానికి సంబంధించి ఒకటి, డిప్యూటేషన్‌కు సంబంధించి ఒకటి, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా భార్య పనిచేస్తున్న పాఠశాలకు బదిలీ చేయాలని కోరుతూ ఒక దరఖాస్తు ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం అఖినేపల్లి మల్లారం ప్రాంతంలో గిరిజన, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భూముల బదలాయింపులు, మ్యుటేషన్లపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒక దరఖాస్తు అందింది. పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని 18 గదుల తాయ్ బజార్ అంగడిపేట షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణను ఐటీడీఏ పరిధిలోకి తీసుకోవాలని నేషనల్ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ప్రతినిధులు దరఖాస్తు సమర్పించారు. అలాగే, పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని 13 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌లో గిరిజనులకు దుకాణాల కేటాయింపు సందర్భంగా అడ్వాన్స్ డిపాజిట్‌కు అదనంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించాలని కోరుతూ మరో దరఖాస్తు అందింది. మంగపేట మండలంలోని ఆదివాసీ విద్యార్థులకు సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని కోరుతూ మరో దరఖాస్తు అందింది. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టొప్పో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జి. ప్రతాప్, డీడీ జనార్దన్, ఈఈ ప్రవీణ, ఏఓ ఎ. అనిల్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. కె. క్రాంతి కుమార్, ఆర్‌సీఓ పద్మిని తదితర అధికారులు పాల్గొన్నారు.



## రామరామ రామ ఉయ్యాలో

పూల పండుగ... బతుకమ్మ సంబరం

ఆటపాటలతో అలరించిన ఆడపడుచులు.. గ్రామాల్లో పండుగ సందడి



**తానూర్:12అక్టోబర్(తెలంగాణ పత్రిక):** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో బతుకమ్మ పండుగను యువతులు, మహిళలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ఆడపడుచులు యువతలు మహిళలు తీరక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు రామరామ రామ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. బతుకమ్మల మధ్య పసుపుతో చేసిన గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ కాలనీ లో ఆడపడుచులు పెద్ద సంఖ్యలో గుమిగూడి బతుకమ్మ పాటల పైన సందడి చేశారు. అనంతరం ప్రధాన వీధుల గుండా డప్పు చప్పుళ్ళు, డీజే,పాటలపై కోలాటాలు వేశారు. సమీపంలో ని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఆడబిడ్డలు స్వగ్రామానికి చేరుకొని ఉత్సవాల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



## సాంప్రదాయబద్ధంగా దేవి నవరాత్రులు నిర్వహించే మండపాలకు సన్మాన కార్యక్రమం

జై హనుమాన్ ఉత్సవ కమిటీ చౌదర్పల్లి వినూత్న నిర్ణయం

హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇచ్చే మండపాలకు ప్రోత్సాహం



రాజారాం రెడ్డి



ఉప్పు జగదీశ్వర్

**బొంరాస్‌పేట్ (అక్టోబర్ 12) తెలంగాణ పత్రిక ప్రతినిధి:** బొంరాస్‌పేట్ మండలంలో దేవి నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉత్సవ కమిటీలు అమ్మవారి మండపాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు, అర్చనలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, భక్తి భావంతో దేవి నవరాత్రులను నిర్వహించే ఉత్సవ కమిటీలను ప్రోత్సహించేందుకు జై హనుమాన్ ఉత్సవ కమిటీ ముందుకు వచ్చింది. మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను జై హనుమాన్ ఉత్సవ కమిటీ సభ్యులు సందర్శించనున్నారు. ముఖ్యంగా డీజేల హోరు, అనవసరమైన శబ్దాలకు దూరంగా ఉంటూ, సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే మండపాలను గుర్తించి, ఆయా ఉత్సవ కమిటీలకు సన్మానం చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుత కాలంలో పండుగల నిర్వహణలో ఆధునిక హంగులు పెరుగుతున్న నేపథ్యంలో, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిటీ సభ్యులు అభిప్రాయపడుతున్నారు. పండుగల అసలు ఉద్దేశం భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యత అని, వీటికి ప్రాధాన్యతనిస్తూ ఉత్సవాలను నిర్వహించే కమిటీలను ప్రోత్సహించడం ద్వారా ఇతర గ్రామాల ఉత్సవ కమిటీలకు కూడా ఆదర్శంగా నిలవవచ్చని పేర్కొన్నారు.

**ప్రతి మండపాన్ని సందర్శించి పరిశీలన**

బొంరాస్‌పేట్ మండలంలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి మండపాలను సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించనున్నట్లు జై హనుమాన్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. డీజే శబ్దాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, భజనలు, భక్తి గీతాలు, సంప్రదాయ పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నవరాత్రులను నిర్వహించే మండపాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

**సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం**

దేవి నవరాత్రులు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, భక్తి, ఐకమత్యం, సేవాభావం, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేలా ఉండాలని కమిటీ భావిస్తోంది. ఈ క్రమంలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించే మండపాలకు పురస్కారాలు అందించడం ద్వారా మంచి విధానాలను ప్రోత్సహించవచ్చని పేర్కొంది. జై హనుమాన్ ఉత్సవ కమిటీ చేపట్టిన ఈ నిర్ణయంపై మండలంలోని దేవి నవరాత్రి ఉత్సవ కమిటీలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ ఉత్సవాలను నిర్వహించే కమిటీలకు గుర్తింపు లభించడం మరింత మందికి స్ఫూర్తినిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైందవ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రులను నిర్వహిద్దాం.. ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందిద్దాం.. అనే సందేశంతో జై హనుమాన్ ఉత్సవ కమిటీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో మదనపల్లి, బురన్పూరు, సూర్యనాయక్ తండాలకు వెళ్లి అమ్మవారిని స్పర్శించుకున్నారు రాజారాం రెడ్డి, వీరశైవ సంఘం మండల అధ్యక్షుడు ఉప్పు జగదీశ్వర్, కే. సుధాకర్, ఈ వెంకటయ్య , కుమ్మరి పుల్లయ్య , కే నర్సయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ అక్టోబర్ 12:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, నేరాల గుర్తింపు, దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, పోలీస్ స్టేషన్లలోని కెమెరాలను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ప్రస్తుతం మొత్తం 467 సీసీటీవీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానం చేయడంతో జిల్లాలో నిఘా వ్యవస్థ మరింత బలోపేతమైంది. ఈ వ్యవస్థ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించడం సులభతరం కానుంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నేరాల నియంత్రణలో సీసీటీవీ నిఘా వ్యవస్థ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in



# పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లాలో 51,400 ఎకరాల్లో పత్తి సాగు 5,14,000 క్వింటాళ్ల దిగుబడి అంచనా
- రైతు వేదికల్లో పత్తి నాణ్యతా ప్రమాణాలు, కప్పాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలి
- వాస్తవ దిగుబడి అధికంగా ఉన్న రైతులకు క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా న్యాయం చేయాలి
- కౌలు రైతులు, ఎన్‌డీఎస్ రైతులకు సీసీఐ కొనుగోళ్లలో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి
- పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,ప్రతినిధి అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** 202627 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పత్తి పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. రాములుతో కలిసి పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, సీసీఐ ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,జిల్లాలో 51,400 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, సుమారు 5,14,000 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అక్టోబర్ రెండో పక్షం నుంచి పత్తి మార్కెట్‌కు రావడం ప్రారంభమై, నవంబర్, డిసెంబర్ నెలల్లో అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర లభించినప్పుడు రైతులు నష్టపోకుండా సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో గుర్తించిన జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈ ఓ లు) ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కనీస మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల వివరాలు, పత్తి నాణ్యతా ప్రమాణాలు, అనుమతించబడిన తేమ శాతం గురించి రైతులకు వివరించాలని సూచించారు. పత్తిని పూర్తిగా ఆరబెట్టి, శుభ్రంగా తీసుకురావాలని, నాణ్యమైన పత్తిలో నాసిరకం పత్తిని కలపవద్దని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కప్పాస్ కిసాన్ యాప్ ద్వారా రైతుల నమోదు, కొనుగోలు కేంద్రాల ఎంపిక, స్లాట్ బుకింగ్ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా స్లాట్లు కేటాయించాలని, క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులను సాధ్యమైనంత వరకు సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్‌లో నిర్దేశించిన సగటు దిగుబడి కంటే వాస్తవ దిగుబడి అధికంగా ఉన్న రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ఏఈఓలకు వ్యక్తిగత లాగిన్ సదుపాయం కల్పించి, రైతుల అభ్యర్థన మేరకు క్షేత్రస్థాయిలో సాగు విస్తీర్ణం, పంట పరిస్థితి, వాస్తవ దిగుబడిని పరిశీలించి, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన పత్తి కొనుగోలు పరిమాణాన్ని పెంచే అవకాశం కల్పించాలని తెలిపారు. అలాగే కౌలు రైతులు, నాన్ డిజిటల్లీ సైన్డ్ ఎన్ డి ఎస్ ) భూముల సాగుదారులు భూమి రికార్డుల సమస్యల కారణంగా కనీస మద్దతు ధర ప్రయోజనాలను కోల్పోకుండా చూడాలని సూచించారు. ఏఈఓల లాగిన్ ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా అర్హులైన కౌలు రైతులు, ఎన్‌డీఎస్ రైతుల నమోదు, ధ్రువీకరణకు సాఫ్ట్‌వేర్‌లో సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు అగ్ని ప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారురైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని, పత్తి కొనుగోళ్ల అనంతరం రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా సీసీఐ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ పత్తిని మధ్యవర్తులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని, అర్హత కలిగిన ప్రతి రైతుకు కనీస మద్దతు ధర ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, వ్యవసాయ అధికారులు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా తూనికలు కొలతల అధికారి రఘువీర్ సింగ్, జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్, మార్కెట్ కమిటీల కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి.



**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబరు 12:** ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కానందున రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జి. తెలిపారు. సాగునీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకొని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని తెలిపారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, సాగునీటి లభ్యత, ఆరుతడి పంటల సాగుపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చున్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో అధిక మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ములుగు జిల్లాలోని 22 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరయ్యారు. వీసి అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ఆరుతడి పంటల సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డి ఆర్ డి ఓ రవీందర్, డి సి ఎస్ ఓ ఫైజల్ హుస్సేన్, డి ఎం డి సి ఎస్ ఓ క్రిష్ణ వేణి, డి ఎంహెచ్ ఓ గోపాలరావు, సి పి ఓ జవహర్, డిపి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వైద్య సహాయం అందించడమే సిఎంఆర్ఎఫ్ లక్ష్యం

పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్



**మందమర్రి మండలం (రామకృష్ణాపూర్) : తెలంగాణ పత్రిక:** రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేద మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మంతెన మల్లమ్మ, దాముక శిరీష, గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్ మాజీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగుల రాజ్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్, మంద సృజన ప్రధాన కార్యదర్శులు మేకల సురేందర్, బత్తుల వేణు ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నక్క శ్రీనివాస్ , సోషల్ మీడియా ఇంచార్జ్ బొద్దుల ప్రేమ్ సాగర్, పట్టణ నాయకులు దాముక రమేష్, కనుకుంట్ల కనకయ్య, కుదిరే రామస్వామి మహిళా నాయకులు జాలిగపు రాజేశ్వరి, దీప, అనూష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నకు మెరుగైన విద్యుత్ సదుపాయం కల్పించాలి!

సకాలంలో సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాకు చర్యలు

అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి సీతక్క



**మంగపేట, అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** మంగపేట మండలంలోని రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా చేసి, వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి సీతక్క విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మైల జయరాం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సీతక్క తన సమస్యలుగా భావించి వెంటనే స్పందించారని తెలిపారు. మంగపేట మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల రైతులు పంటలకు నీరు అందించలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. మంత్రి సూచనలపై స్పందించిన విద్యుత్ శాఖ డీఈ పురుషోత్తం, ఎస్ఈ బిక్షపతి మండలంలో సింగిల్ ఫేజ్‌తో పాటు త్రీ ఫేజ్ విద్యుత్ కూడా సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జయరాం రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రాజుతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాలవ్వ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



**నంగునూరు, అక్టోబరు 12(తెలంగాణ పత్రిక):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన బీనబోయిన బాలవ్వ అనారోగ్యంతో అదివారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. బాలవ్వ మృతి విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్ గౌడ్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై హరీశ్ రావు వెంటనే స్పందించి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాలవ్వ కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా నిలిచిన హరీశ్ రావుకు, విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లిన కోల రమేశ్ గౌడ్‌కు కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉల్లి చిన్న మల్లయ్య, ఉపసర్పంచి కోల శ్రీధర్ గౌడ్, నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ కోల మహేందర్ గౌడ్, వార్డు సభ్యులు రచ్చ సిద్దు, దేవులపల్లి అఖిల రాజేందర్, పందిళ్ల మోహన్ రెడ్డి, కోల సతీశ్ గౌడ్, చింతల కిష్టయ్య, దేవులపల్లి బిక్షపతి, శిరం కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాల సామాజిక సేవకు గుర్తింపు

నరాల మహేశ్వర రెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం




**రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం, అక్టోబర్ 12,(తెలంగాణ పత్రిక):** రెండు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషి చేస్తున్న నరాల మహేశ్వర రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించింది. చెన్నైలోని శ్రీ కృష్ణ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ డాక్టర్ కె. వెంకటేషన్, ప్రొఫెసర్ అమృతవల్లి, జాయింట్ డైరెక్టర్ తోడేటి శ్రీకాంత్ చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

**నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సేవలు**

నరాల మహేశ్వర రెడ్డి తన జీవితంలో సామాజిక సేవకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారు. నిరుపేదలకు అండగా నిలవడం, నిరుద్యోగ యువతకు మార్గదర్శనం అందించడం, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణలో భాగస్వామ్యం కావడం, స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను సమన్వయం చేయడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అంతేకాకుండా పలు స్వచ్ఛంద సంస్థలు చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇరవై ఏళ్లుగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ గుర్తింపు ఆయన సామాజిక సేవా ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

**మరింత సేవ చేసేందుకు ప్రేరణ**

గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా నరాల మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ, ఈ గుర్తింపు తనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తనతో కలిసి వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొని, అన్ని విధాలా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి నిరుపేదలకు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. నరాల మహేశ్వర రెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించడంపై ఆయన శ్రేయోభిలాషులు, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైనవారు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం ఆయన సామాజిక సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు స్ఫూర్తినిస్తుందని వారు అభిప్రాయపడ్డారు..

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్



**మెదక్ జిల్లా ప్రతినిధి తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్య మిస్తూ ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 83 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భూభారతి 33, ఇందిరమ్మ ఇండ్లు 13, పెన్షన్లు 04, ఇతర 33 మొత్తం 83 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

జ్ఞానేష్ కుమార్ ను దేశద్రోహిగా ప్రకటించి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి

సర్‌ను వెంటనే నిలిపివేయాలి

తొర్రూరులో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘంల ఆధ్వర్యంలో నిరసన



**పాలకుర్తి/తొర్రూరు తెలంగాణ పత్రిక ప్రతినిధి పున్నం సారయ్య:** దేశంలో అక్రమంగా 13 కోట్ల ఓట్లను తొలగించిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తో రాజీనామా చేయించి, దేశద్రోహిగా ప్రకటించాలని ప్రజాసంఘాల నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్ , జమ్ముల శ్రీనివాస్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తొర్రూరు మండల కేంద్రం లో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తోరూర్ లో గాంధీ సెంటర్లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం అశోక్ ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకుబ్, సిఐటియు మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్ లు హాజరై మాట్లాడుతూ, దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని, ఇందిరాగాంధీ హయాంలో జరిగిన ఎమర్జెన్సీ ఇప్పుడున్న యువత ఎవరు చూడలేదని కానీ నరేంద్ర మోడీ ఎమర్జెన్సీ మాత్రం ఢిల్లీ జంతర్ మంతర్ లో జరుగుతున్న ఘటనలు కండ్లకు కట్టినట్టుగా కనిపిస్తుందని వారి సందర్భంగా గుర్తుకు చేశారు. ఈ దేశంలో పుట్టిన పౌరుల ఓటు హక్కు ఎలాంటి కారణం చెప్పకుండా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దేశంలోని 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారు. దాని గురించి అడిగితే అధికారంలో ఉన్న బిజెపి పార్టీ ప్రశ్నించిన వారిని దేశద్రోహులని, ఇతర దేశస్తులని కుట్రపన్నీ దేశద్రోహశీ కేసులు పెడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం పౌరులకు వచ్చిన ఓటు హక్కు తీసివేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ప్రజాస్వామ్య పద్ధతిలో ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులు యువకులు సామాజిక కార్యకర్తలు శాంతియుత ధర్నాకు దిగితే, వారి ధర్నాకు భయపడిన కేంద్ర ప్రభుత్వం నాడు ఎమర్జెన్సీని తలపించేలా రైళ్లు, విమానాలు, మెట్రో స్టేషన్లు, బస్సులు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి భయానక పరిస్థితులను కల్పించినటువంటి కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని వారు ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఓట్ల విషయంలో అవినీతికి పాల్పడిన జ్ఞానేష్ కుమార్ ను వెంటనే రాజీనామా చేపిచ్చి దేశద్రోహిగా ప్రకటించాలని, చట్టపరమైన తగు చర్యలు తీసుకొని జైల్లో వేయాలని వారు ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లేనియెడల రానున్న రోజుల్లో ప్రజా సంఘాలు వామపక్ష పార్టీలు ప్రజలందరిని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని వారు సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్రెడ్డి, ధరావత్ యాకన్న, తిమ్మిడి రవి, సోమిరెడ్డి, జితేందర్ రెడ్డి, పెరుమాండ్ల మధుబాబు, నాగన్న, మచ్చ యాకయ్య, ఎండి మై పాషా, షమీనా, కుర్ర వరలక్ష్మి, శ్రీరంగం రాధ, శ్రీలత, శోభ ,సౌజన్య, ఐలమ్మ, పల్లె పద్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జ్ఞాన సరస్వతి మాత ఆలయంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు



**ధర్మసాగర్, అక్టోబర్ 11 (తెలంగాణ పత్రిక):** రామగిరి సోమలింగం ఆచార్య, సోమలక్ష్మి దంపతులచే నిర్మించబడిన రాయగూడెం శ్రీ జ్ఞాన సరస్వతి మాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల ప్రథమ రోజున అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో కుంకుమార్చన, ప్రత్యేక అర్చనలు, యజ్ఞం, అమ్మవారి అష్టోత్తర పూజలు, మంగళహారతులు తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎర్రోజు వీరన్నాచార్య, ఎర్రోజు విక్రమాచార్య మాట్లాడుతూ నవరాత్రుల తొమ్మిది రోజుల పాటు శ్రీ జ్ఞాన సరస్వతి మాత వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపాకటాక్షాలను పొందాలని విజ్ఞప్తి చేశారు.

# సూపర్ ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క • తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి • నీటి లభ్యత ఆధారంగా పంటలు ఎంపిక చేసుకోవాలి
- ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి • వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు • 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలి
- యాసంగి 202627 సాగుపై రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం • సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలి • జిల్లా కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. 202627 యాసంగి సాగుపై సోమవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ, సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రైతులకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో, ఎస్ఆర్ఎస్పీ నుంచి సాగునీటి విడుదల లేని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పశువులకు మేత, నీటి సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ములకలపల్లి మండలం జగన్నాధపురం రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులు, సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణ అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో రైతులను కలిసి పప్పుధాన్యాలు, పెసలు, కందులు, మిరప తదితర పంటల సాగుపై అవగాహన కల్పించారని తెలిపారు. ఈసారి కూడా రైతు వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు తగిన సూచనలు అందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో భూగర్భ జలమట్టం సుమారు రెండు మీటర్ల మేర తగ్గిన నేపథ్యంలో తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాబోయే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాల్లోని పాత తాగునీటి పథకాలు, బోరుబావులు, ఇతర నీటి వనరులను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీవోలు, ఎంపీవోలను ఆదేశించారు. తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలను అంచనా వేసి, అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీ –జి రామ్ జి పథకం కింద ప్రతి గ్రామంలో కనీసం 20కి పైగా పనులను గుర్తించి పనుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఫామ్ పాండ్స్ నిర్మాణం వంటి పనులను చేపట్టాలని, వాటి ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు అనుకూల పరిస్థితుల్లో చేపల పెంపకం వంటి అనుబంధ ఉపాధి అవకాశాలను కూడా వినియోగించుకోవచ్చని అన్నారు . పశువులకు తాగునీరు, మేత కొరత ఏర్పడకుండా సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈసారి వరి సాగు విస్తీర్ణాన్ని సుమారు 50 వేల ఎకరాల మేర తగ్గించినట్లు కలెక్టర్ తెలిపారు. తగ్గించిన విస్తీర్ణంలో మినుములు, పెసలు, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో విస్తృతంగా సాగవుతున్న ఆయిల్ పామ్ పంటను ఇతర అనుకూల మండలాల్లోనూ ప్రోత్సహించాలని, ములకలపల్లి, చండ్రుగొండ తదితర మండలాల్లో నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా ఆయిల్ పామ్ సాగు అవకాశాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఉపాధి హామీ పనులు, పశుసంరక్షణ అంశాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ నీటి లభ్యత, సాగు వ్యయాలు, పంటల ద్వారా లభించే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని తగిన సాగు ప్రణాళిక రూపొందించుకునేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సునీత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, మార్కెటింగ్ అధికారి అలీమ్ ఖాన్, భూగర్భ జలవనరుల శాఖ అధికారి రమేష్, తాసిల్దార్ స్వాతి బిందు, ఎంపీడీవో, ప్రజా ప్రతినిధులు, రైతులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## వైభవంగా దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు



**కామారెడ్డి, అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం భూంపల్లి గ్రామంలో హిందు విరాట్ యూత్ ఆధ్వర్యంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్టతో గ్రామంలో సందడి నెలకొంది. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా డప్పు వాయిద్యాలతో. దుర్గ దేవిని అందంగా అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు. నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన నైవేద్యాలు సమర్పిస్తారు ప్రతిరోజు అమ్మవారికొక్క రూపంలో భక్తులకు దర్శనిమిచ్చున్నారు. 11 రోజుల పాటు మండపం వద్ద నిత్యం అన్నదాన కార్యక్రమం భజన కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో హిందు విరాట్ యూత్ అధ్యక్షులు గైని రాజేందర్. ఉపాధ్యక్షులు సుంకరి నవీన్. గైని శేఖర్. క్యాషియర్ సుంకరి వేణుగోపాల్. డీజే నిర్వాకుడు గైని రిశ్వంత్ (బన్నీ). ప్రధాన కార్యదర్శి గైని శ్రీకాంత్. దుర్గామాత మాలధారణ స్వాములు. మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక)అక్టోబర్ 12:** రామాయంపేట మండలం రైతు వేదికలో నిర్వహిస్తోన్నరైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సిపిఓ సురేష్ మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, నాలుగో అవార్డు కౌన్సిలర్ బైరం స్వప్న కుమార్, ఏడవ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా, 11వ వార్డ్ కౌన్సిలర్ డాకీ శ్యామల స్వామి, రెండో వార్డ్ కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్, ఆదర్శ రైతు అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 72 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ,అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించగా, ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవి తేజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రెండవ రోజు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత



**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది అక్టోబరు 12:** ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ స్థలం నందు స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు (సోమవారం) అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు ప్రవీణ్ శర్మ గారి ఆధ్వర్యంలోఅమ్మవారి కి ప్రత్యేక పూజలు చేశారు. మహిళ భక్తులతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నూక ప్రభాకర్, లక్ష్మణాచారి, బిక్షపతి, ప్రసాద్,గంజి రమేష్,సురేష్, కిరణ్ రాకేష్, వెంకటేశ్వర్లు, విక్రమ్,కోటి, మహంత్,ప్రసన్న శిరీష సుజాత మహిళలు పాల్గొన్నారు.

## రక్తదానంతో ఆదర్శంగా ప్రశాంత్ గౌడ్

12వ సారి రక్తదానం

సేవ చేయడానికి పదవులు అవసరం లేదు



**కామారెడ్డి ,అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా రెడ్డి పెట్ గ్రామానికి చెందిన ప్రశాంత్ గౌడ్ 12వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడం జరిగిందని రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు తెలియజేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందజేయడం కోసం సంవత్సరంలో మూడు సార్లు రక్తదానం చేస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలవడం జరిగిందని అన్నారు. రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడాలని సూచించారు. రక్తదానం చేసే రక్తదాతలకు గుండె జబ్బులు,క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి సమస్యలను తగ్గించుకోవచ్చు అనే విషయాన్ని తెలుసుకుని రక్తదానానికి ముందుకు రావాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని, సేవ చేయడానికి పదవులు అవసరం లేదని కొందరు మాత్రం పదవులను పొందడం కోసమే రెడ్ క్రాస్ లోకి రావడం జరిగిందని, వీరి వల్ల సమాజానికి ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. తల సేమియా బాధితుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందజేయడానికి సిద్ధంగా ఉంటామని అన్నారు. రక్తదాత ప్రశాంత్ గౌడ్ కు అభినందనలు తెలిపారు.

## సొంత నిధులతో బతుకమ్మ వేడుకలకు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు సహకారం

వివిధ గ్రామాలకు 6, డీజే సౌండ్ సిస్టమ్స్ పంపిణీ



**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది అక్టోబరు 12:** తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను గ్రామంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆడబిడ్డలు ఎంతో వైభవంగా, సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు గారు తన సొంత డబ్బులతో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బతుకమ్మ వేడుకల నిర్వహణ నిమిత్తం గ్రామ పరిధిలోని వివిధ గ్రామాలకు/ప్రాంతాలకు చెందిన ఆడబిడ్డల కోసం డిజే సౌండ్ సిస్టమ్‌లను తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసి అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ... "తెలంగాణ ఆడపడుచులకు అతిపెద్ద పండుగ బతుకమ్మ. ఊరూరా మరియు వివిధ ప్రాంతాలలోని మహిళలందరూ ఒక్కటై సంబరాలు చేసుకునే ఈ పండుగలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అందరూ ఉత్సాహంగా పాటలు పాడుతూ ఆడుకోవడానికి నా వంతు బాధ్యతగా సొంత నిధులతో 6,ఈ సౌండ్ సిస్టమ్‌లను వివిధ గ్రామాలకు అందించడం జరిగింది. మన సంస్కృతిని కాపాడుకుంటూ, వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలి" అని తెలిపారు. గ్రామ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఆడబిడ్డల వేడుకల కోసం తన సొంత డబ్బులతో సౌండ్ సిస్టమ్‌లు అందజేసినందుకు సర్పంచ్ దంపతులకు గ్రామస్థులు, మహిళలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోరిక గోవింద నాయక్, కాకులమర్రి ప్రదీప్ రావు గారు, తుమ్మ మల్లారెడ్డి, కూనూరు అశోక్ గౌడు, మాజీ ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, తాడూరి రఘు, ఎండి ఖాజా పాషా, కర్ర రవీందర్, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, రామాలయం గుడి చైర్మన్ దన్నపునేని కిరణ్, పులసం పురుషోత్తం, కుమ్మరి చంద్రబాబు, గండేపల్లి నర్సయ్య, వావిలాల ముత్తయ్య,జాడి భోజరావు, కాళ్ల రామకృష్ణ, కొండాయి చిన్ని, బట్టు గోపి, ఏం పెల్లి రాజు, పెద్ద బోయిన బాలకృష్ణ, గండేపల్లి నాగరాజు, బాస శరత్, మాదరి మధు,మాజీ కోఆప్షన్స్ సభ్యులు ఖలీల్, దేపాక శ్రీరాములు, దేవేందర్ వేణు గ్రామ ప్రముఖులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్టీఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కామారెడ్డి పిఎస్‌లో కేక్ కట్ చేసిన సిఐ నరహరి, రాష్ట్ర డైరెక్టర్ సలీం



**కామారెడ్డి, అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి పట్టణంలో పోలీస్ స్టేషన్లో సోమవారం ఆర్టిఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కామారెడ్డి స్థానిక సీఐ నరహరి మరియు సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీమ్ లు కలిసి కేక్ కట్ చేసి ఆర్టిఐ 21వ వార్షిక వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ సలీం కు సీఐ నరహరి శాలువాతో సత్కరించి సమాచార హక్కుచట్టం 2005 కొరకు కృషి చేస్తున్న నేపథ్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను జాగృతం చేస్తున్నందుకు గాను రాష్ట్ర డైరెక్టర్ సలీం ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రడైరెక్టర్ సలీం కూడా స్థానిక సీ.ఐ నరహరి ని శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా సి.ఐ నరహరి మాట్లాడుతూ కామారెడ్డి పోలీస్ స్టేషన్లో సమాచార హక్కు చట్టం 2005 అనేది 100% అమలులో ఉండదని తెలుపుతూ ప్రజలు వారికి కావాల్సిన సమాచారాన్ని గడువు లోపల ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. సమాచారం కోసం పోలీస్ స్టేషన్ కు సంప్రదించినచో ఆర్.టి.ఐ బోర్డు అందుబాటులో ఉన్నది, దానిమీద ప్రజా సమాచార అధికారి సహాయ ప్రజా సమాచార అధికారి మరియు అప్పిలెట్ అధికారుల పేర్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఇట్టి కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు శివ పూజ లింబయ్య, జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, మీడియా సలహాదారులు సయ్యద్ జావిద్, తెలంగాణ క్రైమ్ రిపోర్టర్ పెరియార్ రామస్వామి, రాజన్న, సిరిసిల్ల కామారెడ్డి జిల్లా ప్రతినిధులు రవి, భాస్కర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

RNI No. APTEL/2008/23088
తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in


# కరెంటు కోతలను నివారించి రైతన్నలను ఆదుకోవాలి

ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా కారదర్శి జబ్బార్



**కామారెడ్డి ,అక్టోబర్ 12,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)** కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నెలకొన్న కరెంటు కోతలు నివారించి రైతన్నలను ఆదుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన కరువు విద్యుత్ సమస్య మూలంగా రైతులు కూలీలు అనేక ఇబ్బందులు గురై వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందని ప్రభుత్వం తక్షణమే కామారెడ్డి జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి జబ్బర్ సోమవారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కరువు కరెంటు నీటి కొరత పరిస్థితుల తీవ్రత పై ప్రభుత్వం దృష్టి సారించాలనీ 24 గంటల కరెంటు ను పది గంటలు ఇవ్వడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు కరువు బారిన పడినట్టు అనేక సర్వేలు ప్రకటించాయని ఈ ప్రభావం పశువుల పైన వేడి తీవ్రత అన్ని జీవుల పైన పడటం ఫలితంగా జీవులు పక్షులు చనిపోతున్న పరిస్థితి ఉంది రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర కరువు పరిశీలిన ఇబ్బందుల్ని పరిశీలించి రాష్ట్రంగా పరిశీలన చేసి పరువు ప్రాంతంలో ప్రకటించి కరువు నివారణ చర్యలు లు చేపట్టాలని పారుకోరారు లేనిపక్షంలో రాష్ట్రాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



**మెదక్ జిల్లాప్రతినిది తెలంగాణ పత్రిక 12 అక్టోబర్:** ప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా విచారణ పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంతో పాటు సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ సర్పంచ్ నరసయ్య



**కామారెడ్డి, సెప్టెంబర్ 12,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాదోమకొండ మండల కేంద్రంలో సోమవారం ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరై నర్రాగుల లావణ్య శ్రీనివాస్ దంపతులకు నూతన వస్త్రాలను మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ సర్పంచ్ ఐరెని నరసయ్యలు అందజేశారు ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సహకారంతో దోమకొండ మండలానికి 122 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. దోమకొండ 44 అంబర్పేట్ 20 అంచనూర్ 5 చింతామణి పల్లి 6 గొట్టుముక్కల 6 లింగు పల్లి 3 ముత్యంపేట్ 21 సంగమేశ్వర్ 17 మంజూరైనట్లు వివరించారు కార్యక్రమంలో దోమకొండ సింగిల్ విండో చైర్మన్ అనంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సీతారాశీ మదు ఇందిరమ్మ కమిటీ సభ్యులు నర్సింలు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) అక్టోబర్, 11:** జయశంకర్ భూపాలపల్లి సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 67 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్నందున, వారి అర్జీల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశామని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా, అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా వారంలోగా చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్జీలపై తీసుకున్న చర్యలు, పరిష్కార పురోగతికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీకి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ప్రజలు దూరం.. సమస్యలు లేనట్టేనా?

చిన్నశంకరంపేట మండలంలో సోమవారం
ప్రజావాణికి రెండు దరఖాస్తులే..
కారణాలపై చర్చ
సమస్యలు పరిష్కారం కావడం లేదా?
అధికారుల హాజరు లేకపోవడమే కారణమా?



**మెదక్ జిల్లా,చిన్నశంకరంపేట, అక్టోబర్ 12 ( తెలంగాణ పత్రిక):** ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి చిన్నశంకరంపేట మండలంలో ప్రజల నుంచి స్పందన అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించేందుకు ముందుకు రావడం లేదు. మండలంలోని వివిధ గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రజావాణికి దరఖాస్తులు ఎందుకు రావడం లేదన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**రెండు దరఖాస్తులకే పరిమితం**

చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. అయినప్పటికీ ప్రజావాణికి ఇంత తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడం పలు సందేహాలకు తావిస్తోంది.

**సమస్యలు లేవా.. పరిష్కారంపై నమ్మకం లేదా?**

గ్రామాల్లో సమస్యలు ఉన్నప్పటికీ ప్రజలు వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎందుకు ఆసక్తి చూపడం లేదన్నది ప్రశ్నగా మారింది. ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించినా సమస్యలు పరిష్కారం కావడం లేదనే భావన ప్రజల్లో ఉందా? దరఖాస్తులపై అధికారులు స్పందించకపోవడం, పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుండటం వంటి కారణాలతో ప్రజలు వెనుకడుగు వేస్తున్నారా? లేక ప్రజావాణి కార్యక్రమంపై తగిన అవగాహన లేకపోవడం వల్ల దరఖాస్తులు తగ్గుతున్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల హాజరు కూడా కీలకమే!**

ప్రజావాణి కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజలు దరఖాస్తులు సమర్పించడం ఎంత ముఖ్యమో, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు అందుబాటులో ఉండటం కూడా అంతే ముఖ్యం. ప్రజలు తమ సమస్యలతో కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో లేకపోతే వారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే చిన్నశంకరంపేట మండలంలో ప్రజావాణికి దరఖాస్తులు తక్కువగా రావడానికి అధికారుల గైర్హాజరే కారణమని నిర్ధారించే సమాచారం లేదు. ఈ అంశంపై స్పష్టత రావాలంటే కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు ఎంతమంది హాజరవుతున్నారు? వచ్చిన దరఖాస్తులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? సమస్యలు పరిష్కారమవుతున్నాయా? అనే వివరాలను పరిశీలించాలి.

**ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం**

ప్రజావాణి కార్యక్రమం ఉద్దేశం ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టడం. గ్రామస్థాయిలో ప్రజలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించడంతో పాటు, దరఖాస్తు సమర్పించే విధానం, అవసరమైన పత్రాలు, దరఖాస్తులపై తీసుకునే చర్యల గురించి అధికారులు వివరించాలి. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తే మరిన్ని సమస్యలు అధికారుల దృష్టికి వచ్చే అవకాశం ఉంటుంది.

**దరఖాస్తుల పరిష్కారంపై స్పష్టత ఇవ్వాలి**

ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుల వివరాలు, వాటిపై తీసుకున్న చర్యలు, పరిష్కరమైన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలి. ప్రజలు సమర్పించిన దరఖాస్తులకు సంబంధించి పురోగతిని తెలియజేస్తే కార్యక్రమంపై విశ్వాసం పెరిగే అవకాశం ఉంది. గ్రామాల్లో సమస్యలు ఉన్నాయా లేదా అన్నది దరఖాస్తుల సంఖ్యతోనే నిర్ణయించలేం. ప్రజలు ఎందుకు ముందుకు రావడం లేదన్న విషయాన్ని గుర్తించి, ప్రజావాణిని మరింత ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజావాణికి రెండు దరఖాస్తులే రావడం వెనుక అసలు కారణమేంటి? ప్రజల్లో అవగాహన లోపమా? సమస్యల పరిష్కారంపై నిరాశా? లేక ఇతర కారణాలున్నాయా? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలు కనుగొని ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

# నేడు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం

కవి, లెక్చరర్ ఉమాశేషారావు వైద్య



**కామారెడ్డి ,అక్టోబర్ 12,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)** నేడు అన్నపూర్ణాదేవి అవతారం లో అమ్మవారు దర్శనం ఇస్తారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం. సకల ప్రాణకోటికి జీవనాధారం అన్నం. అన్నపూర్ణ రూపంలో అమ్మ రసపాత్రను ధరించి దర్శనమిస్తుంది. ఆదిభిక్షువైన మహాశివునికి భిక్షపెట్టిన తల్లి అన్నపూర్ణ. ప్రపంచ సృష్టిపోష కురాలుఅమ్మ అనేఅంతరార్థం ఈ అవతారికలో కనిపిస్తుంది. అమ్మ ధరించిన రసపాత్ర అక్ష యశుభాలను అందిస్తుంది. అన్నపూర్ణను ధ్యానిస్తే మేధా శక్తి వృద్ధి చెందుతుంది. మధు ర భాషణం, సమయస్ఫూర్తి, వాక్సుద్ధి, భక్తిశ్రద్ధలు, ఐశ్వ ర్యం కలుగుతాయి. భక్తుని సకలసంపూర్ణునిగా అనుగ్రహి స్తుంది ఈ తల్లి. బుద్ధి జ్ఞానాల ను ఈ తల్లి వరంగా ఇస్తుంది. పరిపూర్ణభక్తితో తనను కొలిచి న భక్తుల పోషణభారం ఈమె వహిస్తుందనిఅర్షవాక్యం. అమ్మ వారిని తెల్లని పుష్పాలతో పూ జ చెయ్యాలి. హ్రీం శ్రీం, క్లీం ఓం నమోభగత్యన్న పూర్ణేశిమమాభిలాషిత మహిదేవ్యన్నం స్వా హా అనే మంత్రాన్ని జపించాలి. అన్నపూర్ణ అష్టోత్తరం, స్తోత్రా లు పారాయణ చెయ్యాలి. అమ్మవారికి కొబ్బరి అన్నం నైవేద్యంగాసమర్పించాలి. శ్రీ అన్నపూర్ణా దేవి స్తోత్రము! నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్య రత్నాకరీ నిర్ధూతాఖి ల ఘోర పావనకరీ ప్రత్యక్ష మాహేశ్వరీ। ప్రాలేయాచల వంశ పావనకరీ కాశీపురా ధీశ్వరీ భిక్షాం దేహి కృపా వలంబనకరీమాతాన్నపూర్ణేశ్వ రీ నానా రత్న విచిత్ర భూష ణకరి హేమాంబరాడంబరీ ముక్తాహార విలంబమాన విలసత్-వక్షోజ కుంభాంతరీ। కాశ్మీరాగరు వాసితా రుచికరీ కాశీపురాధీశ్వరీ భిక్షాం దేహి కృపావలంబనకరీమాతాన్నపూర్ణేశ్వరీ యోగానందకరీ రిపుక్షయకరీ ధర్మైక్య నిష్ఠాకరీ చంద్రార్కానల భాసమాన లహరీ త్రైలోక్య రక్షాకరీ। సర్వైశ్వర్యకరీ తపః ఫలకరీ కాశీపురాధీశ్వరీభిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్న పూర్ణేశ్వరీ కైలాసాచల కందరాలయకరీ గౌరీ-హ్యుమాశాంకరీ కౌమారీ నిగమార్థ-గోచరకరీ-హ్యోంకార-బీజాక్షరీ। మోక్షద్వార-కవాటపాటనకరీ కాశీపురాధీశ్వరీ భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ దృశ్యాదృశ్య-విభూతి-వాహనకరీ బ్రహ్మాండ-భాండోదరీ లీలా-నాటక-సూత్ర-ఖేలనకరీ విజ్ఞాన-దీపాంకురీ। శ్రీవిశ్వేశమనః-ప్రసాదనకరీ కాశీపురాధీశ్వరీ భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ఉర్వీసర్వజయేశ్వరీ జయకరీ మాతా కృపాసాగరీ వేణీ-నీలసమాన-కుంతలధరీ నిత్యాన్న-దానేశ్వరీ। సాక్షాన్మోక్షకరీ సదా శుభకరీ కాశీపురాధీశ్వరీ భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ఆదిక్షాంత-సమస్తవర్ణనకర భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ .అన్నము తిన్నపుడు ఈ మంత్రం తప్పక చదువుతారు. అన్నపూర్ణేసాదా పూర్ణశంకర-ప్రాణవల్లభ్నేన-వైరాగ్య-సిద్ధయర్థం బిక్షిం దేహి చ పార్వతీ మాతా చ పార్వతీదేవీ పితాదేవో మహేశ్వరః। బాంధవా: శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ సర్వ-మంగల-మాంగల్యే శివే సర్వార్థ-సాధికే। శరణ్యే త్ర్యం బకే గౌరి నారాయణి నమ్మోస్తు తే

# మహమ్మద్‌నగర్‌లో ఘనంగా దుర్గామాత లక్ష గాజుల పూజ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దపేదర్ రాజు



**జుక్కల్ ఆర్సీ / (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 12:** మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో దుర్గామాత సేవకుడు నరేష్ గౌడ్ స్వామి ఆధ్వర్యంలో లక్ష గాజుల పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దపేదర్ రాజు హాజరై దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, సీనియర్ నాయకులు జి. మహేందర్, ఉపసర్పంచ్ మిడత సాయిలు, పుట్ల కిష్టయ్య, దుర్గామాత సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కిషన్ గూడ ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**రాజేంద్రనగర్ ప్రతినిధి అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక:** శంషాబాద్ పరిధిలోని కిషన్ గూడా ఫ్లైఓవర్ పైన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు శంషాబాద్ ఆర్.జి.ఐ.ఏ పోలీసులు గుర్తించారు. చుట్టుపక్కల ప్రాంతాలలో మృతుడి వివరాలు అడిగి తెలుసుకునగా మృతుడు గత కొన్ని నెలలుగా చుట్టుపక్కల ప్రాంతాలలో భిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి 55 సంవత్సరాల వయసు కలిగి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాల కోసం పోలీసులు దర్యాప్తును చేపట్టారు.

# పటిష్ట ప్రణాళికతో రీసర్వే నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్





**మెదక్ జిల్లాప్రతినిది తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** పటిష్ట ప్రణాళికతో గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ... రీ సర్వేలో సర్వే అధికారులు, రెవెన్యూ అధికారుల పాత్ర కీలకమన్నారు. గ్రామాల్లో రైతులకు రీసెర్వేపై అవగాహన కల్పించి, పలు సందేహాలను నివృత్తి చేయాలన్నారు. రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో 9(2) నోటీసులు అందిన వారి అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ ,సర్వే శాఖల సమన్వయంతో నిర్వహించాలన్నారు. పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్ళినప్పుడే ప్రజలు అడిగే సందేహాలను నివృత్తి చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఏడి సర్వే కిషన్, రెవెన్యూ డిప్యూటీ తహసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు,సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

సభ్యులకు ఘన సన్మానం




**సూర్యాపేట, అక్టోబరు 12, తెలంగాణ పత్రిక, జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్:** చిలుకూరు మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు వజ్ర వీరయ్య గారి ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు హరి కిషన్, అంజయ్య, నరేష్ గార్లు పాల్గొని ప్రెస్ క్లబ్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడంతో పాటు, నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

**నూతన కార్యవర్గం:** అధ్యక్షులు: దొంతగాని సైదులు గౌడ్ (తెలంగాణ వాణి) ఉపాధ్యక్షులు: గంగిరెడ్డి అశోక్ రెడ్డి (చంద్రా న్యూస్) ప్రధాన కార్యదర్శి: భట్టు సంతోష్ తోళానాయక్ (తెలంగాణ పత్రిక) సహాయ కార్యదర్శి: కాంపాటి శ్రీనివాస్ (వుదయం న్యూస్) కోశాధికారి: కోల శ్రీనివాస్ గౌడ్ (నీగానేత్రం) గౌరవ సలహాదారులు: మల్లెపంగు సూరిబాబు (ప్రజా న్యూస్), కుర్రా రామారావు (బతుకమ్మ న్యూస్) కార్యవర్గ సభ్యులుగా భట్టు శ్యామ్ కుమార్ నాయక్ (T9 న్యూస్), బోడ శ్రీను (మన సాక్షి), బాలెబోయిన వినయ్ గౌడ్ (డైనమిక్), A. వీరబాబు (ప్రజా దర్బార్), గుజ్జుల శాంతి రెడ్డి (జఖ న్యూస్), G. పవన్ కుమార్ (ప్రజాపక్షం) ఎన్నికయ్యారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీకి పలువురు నాయకులు, జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో అవకతవకలు, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా కుడిమాండ్



**కామారెడ్డి, అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** ఢిల్లీలో విపక్ష నేతలపై జరిగిన పోలీసుల తీరుకు నిరసనగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'చలో ఢిల్లీ' భారీ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి గారు, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ లు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్
Epaper.Telanganapatrika.in
మంగళవారం
అక్టోబర్ 13, 2026
కరీంనగర్



# రైతులు వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి





## రాష్ట్ర మంత్రులు బట్టి విక్రమార్క తుమ్మల నాగేశ్వరరావు సూచన

**కామారెడ్డి ,అక్టోబర్ 12 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** రైతు నేస్తం కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన రైతు నేస్తం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు కూరగాయల సాగును ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. కామారెడ్డి జిల్లాలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటూ, సమగ్ర వ్యవసాయ విధానాలు, సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో నిర్వహించిన రైతుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత వానాకాలంలో వర్షపాతం లోటు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 72 రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో సుమారు 5,000 మంది రైతులు, 200 మంది ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని పంటల సాగు, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలపై చర్చించినట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్ల మేర తగ్గిన నేపథ్యంలో నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా కంది, పెసర, మినుములు, శనగలు, వేరుశనగ, ప్రొద్దు తిరుగుడు, జొన్న, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను నేల స్వభావం, స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. ప్రణాళిక బద్ధ మరియు సమగ్ర వ్యవసాయంతో అదనపు ఆదాయం పొందుతూ పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణతో రైతులు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చని రైతు శ్రీకాంత్ తన అనుభవంతో నిరూపిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మూడు ఎకరాల భూమిలో పసుపు, ఉల్లిగడ్డ, కూరగాయలు, పెసర్లు, డ్రాగన్ ఫ్రూట్ వంటి పలు రకాల పంటలను సాగు చేస్తూ, రసాయన ఎరువులు, యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ఆయన చర్యలు చేపడుతున్నారని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు పొలంలో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, నేల సారాన్ని పెంచేందుకు పెసర్లను పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగిస్తున్నారు. వరి పొలంలో పెంపకం ద్వారా యూరియా అవసరాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండించేందుకు పందిరి విధానాన్ని అనుసరిస్తూ, అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు. అర ఎకరంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ ద్వారా మొదటి ఏడాది రూ. 1.50 లక్షలు, రెండో ఏడాది రూ. 3 లక్షలు, మూడో ఏడాది నుంచి సుమారు రూ. 5 లక్షల వంకు ఆదాయం పొందుతున్నట్లు ఈ సందర్భంగా రైతు శ్రీకాంత్ వెల్లడించారు. పంటల వైవిధ్యం, సహజ వనరుల సంరక్షణ, సమగ్ర వ్యవసాయ విధానాలు రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుస్తాయని కలెక్టర్ తెలిపారు. పామాయిల్తో పాటు అంతర పంటల సాగుతో అదనపు లాభాలు పామాయిల్ సాగుతో పాటు అంతర పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్న గాంధారి మండలం గుడిమెట్ గ్రామ రైతు అనుభవం ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. గతంలో తన 15 ఎకరాల భూమిలో సోయాబీన్, మొక్కజొన్న, వరి పంటలను సాగు చేసిన సదరు రైతు, వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతూ 2023 జూన్లో పామాయిల్ సాగు ప్రారంభించారు. పామాయిల్ తోటలో మొదటి ఏడాది పత్తి, మునగ; రెండో ఏడాది మునగ, కంది పంటలను అంతర పంటలుగా సాగు చేశారు. ప్రస్తుతం మూడో ఏడాది ఉద్యానవన శాఖ ద్వారా పొందిన బంతిపూల మొక్కలతో సాగు చేపట్టారు. పామాయిల్తో పాటు అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నట్లు రైతు తెలిపారు. మొదటి కోతలో మూడు క్వింటాళ్ల వరకు పామాయిల్ దిగుబడి వచ్చిందని, పంట విక్రయించిన మూడు నుంచి నాలుగు రోజుల్లోనే డబ్బులు ఖాతాలో జమ కావడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. నీటి వసతి తగ్గిన నేపథ్యంలో గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరిని ప్రస్తుతం ఇంటి సమీపంలోని ఒక ఎకరానికే పరిమితం చేసినట్లు తెలిపారు. రానున్న యాసంగి సీజన్లో ఆ ఎకరంలో కూడా వరికి బదులుగా మునగ సాగు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల ఎంపికలో తగిన మార్పులు చేసుకోవాలని, పామాయిల్ వంటి దీర్ఘకాలిక పంటలతో పాటు అనువైన అంతర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీమాయాల లక్ష్మి, కామారెడ్డి ఏఎంసీ చైర్మన్ ధర్మగోని లక్ష్మి, రైతులు , ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అందుబాటులో ఉన్న సహజ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారిని జ్యోతి, తహసిల్దార్ హిమబిందు, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్



**గంభీరావుపేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** దేశంలో జరుగుతున్న ఓట్ చోరీ కార్యక్రమం పై దేశ రాజధాని ఢిల్లీలో ప్రియతమ నాయకులు అఖిల భారత కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపడుతున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా సోమవారం రోజున సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఆదేశాలను సారం గంభీరావు పేట మండలం నుండి సుమారు 100 బైక్లతో భారీ ర్యాలీ నిర్వహించి ఓట్ చోరీకి పాల్పడుతున్న ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని హమీద్ డిమాండ్ చేశారు ఈ దేశాన్ని పాలించే నైతిక హక్కు మోడీకి లేదని బిజెపి డౌన్ డౌన్ మోడీ డౌన్ లోడ్ అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు తదనంతరం సిరిసిల్ల పట్టణానికి తరలి వెళ్లారు ఈ సందర్భంగా గంభీరావు పేట మండల కేంద్రంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ సంస్థలను సైతం తన అధికార బలంతో గుప్పెట్లో పెట్టుకుని ముఖ్యంగా భారతదేశ ఎన్నికల కమిషన్ ద్వారా భారత రాజ్యాంగం కలిగించిన ఓటు హక్కును తొలగించేటి కార్యక్రమాన్ని ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ద్వారా నడుపుతుందని భారతదేశంలో ఉన్నటువంటి కొన్ని కోట్ల మంది ఓట్లను తొలగించి ఓట్ చోరీ ద్వారా వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిందని ఇంత అ ప్రజాస్వామికంగా రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్నటువంటి పర్యావసానాలు దేశ భద్రతకు ప్రమాదంగా మారుతుందని తెలిపారు ఈ ఓట్ చోరీ గురించి భారతదేశ జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గత ఏడు సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నారని ఈరోజు రాహుల్ గాంధీ పోరాటాన్ని భారతదేశ ప్రజలందరూ గమనించి రాహుల్ గాంధీకి అండగా నిలబడడం నిజంగా హర్షించిందని అదేవిధంగా బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ అమిత్ షా లు ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఏ విధమైనటువంటి కుట్రలు పన్నుతున్నారో భారతదేశ రాజ్యాంగాన్ని రద్దు చేయాలని దుర్దేశంతో ముందుకు వెళ్తున్నారని గమనించిన భారతదేశ ప్రజలందరూ అన్ని రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జెన్జీ యువత కదంతొక్కి ఈరోజు దేశంలో నుండి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేదాకా నిష్క్రమించబోమని ప్రతిజ్ఞ భూమితున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పర్ష హనుమాన్లు కొమిరిశెట్టి తిరుపతి రాజనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్




**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక)అక్టోబర్ 12:** ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 49 ఫిర్యాదులు, వినతులను కలెక్టర్ స్వీకరించారు. ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి, పెండింగ్లో ఉంచకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు సమస్య పరిష్కారంపై తగిన సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కె. వై. ప్రసాద్, ఆర్డీఓలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహారావు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జగిత్యాల జిల్లాలో దశాబ్ది ఉత్సవాలు ఏర్పాటు

డీజే పాటలకు నృత్యాలు చేసిన బీఆర్ఎస్ శ్రేణులు జై కేసీఆర్ అంటూ నినాదాలు



**జగిత్యాల, అక్టోబర్ 12 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల పట్టణంలోని బీఆర్ఎస్ జెండాలతో గులాబీ మాయమైంది. జగిత్యాల పట్టణంలో తెలంగాణ అమరవీరులకు మౌనం పాటించి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ కారులకు సన్మానం కొత్త బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి క్షీరాభిషేకం చేసి దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించారు. జగిత్యాల పాత బస్టాండ్ వద్ద కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చెసి తహసీల్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ. ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అంగడి బజార్ లో స్వాతంత్ర్య సమరయోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వేలాది మంది కార్యకర్తలు అభిమానులు పాత బస్టాండ్ నుండి పాదయాత్రగా అంగడి బజార్ వరకు ర్యాలీ.. డీజే పాటలకు బీఆర్ఎస్ శ్రేణులు నృత్యాలు చేశాయి. బీఆర్ఎస్ శ్రేణుల జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలతో జగిత్యాల పట్టణం మార్మోగింది. కొత్త బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పరిపాలన సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలను ఏర్పాటు చేశారని మలితరం ఉద్యమంలో తొలితరం ఉద్యమంలో కెసిఆర్ నాయకత్వంలో పని చేయడం ప్రత్యేక అనుభూతినిచ్చిందని అన్నారు. కేసీఆర్ తో తనకు సుదీర్ఘ కాలం స్నేహం ఉందనీ గుర్తు చేశారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు పై బషీర్బాగ్ కాల్పుల పై కేసులకు చలించి శాసన సభ ఉప సభాపతి పదవికి కేసీఆర్ రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమ చేపట్టారని గుర్తు చేశారు . తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను కేసీఆర్ సాకారం చేశారని కెసిఆర్ వ్యవసాయ రంగంలో పంట పెట్టుబడి బీమా 24 గంటల ఉచిత విద్యుత్ దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. రేవంత్ పాలనలో సాగు నీరు లేదు.. కరెంట్ లేదు.. నిత్యావసర వస్తువులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నింటికి కారణం రేవంత్ రెడ్డి మూర్ఖత్వం పాలన వైఫల్యం చెందిందని అన్నారు. కేసీఆర్ నూతన జిల్లాలు ఏర్పాటు చేసి జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారని తెలిపారు. నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయని కేసీఆర్ దూర దృష్టితో నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో గురుకుల పాఠశాలలు ప్రారంభిస్తే అన్ని వర్గాల ప్రజలకు విద్యనందిస్తే రేవంత్ రెడ్డి పాలనలో 4 వేల ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారని అన్నారు. జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ జిల్లాలను చిన్న జిల్లాలు గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి పరిపాలన ప్రజలకు చేరువ చేశారని కేసీఆర్ ను స్ఫూర్తిగా తీసుకొని ఇతర రాష్ట్రాలు సైతం జిల్లాలు ఏర్పాటు చేశాయని అన్నారు. కేసీఆర్ 14 ఏళ్లు ఉద్యమం చేసి తెలంగాణ సాధించారని తెలిపారు. మెడికల్ కళాశాల పూర్తి చేస్తే కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తుందోనని జాప్యం చేశారని విమర్శించారు. కెసిఆర్ 24 గంటల కరెంట్ ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 8 గంటల కరెంట్ ఇస్తున్నారు. యూరియా కోసం చెప్పులు క్యూ పట్టే పాత రోజులు తీసుకువచ్చారని మండిపడ్డారు. వరద నీటిని కన్నెపల్లి పంపు హౌస్ నుండి ఎత్తిపోసి సద్వినియోగం చేసుకోవాలని మొదటి నుండి చెప్తున్న పట్టించుకోలేదని ప్రభుత్వ అసమర్ధతతో పంటలు ఎండిపోతున్నాయని చావు నోట్లు తలపెట్టీ తెలంగాణ సాధించిన కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రజలకు పాలన అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు నూతన జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. వలసలు రైతుల ఆత్మహత్య లను నివారించేందుకు రైతులను ఆదుకునేందుకు రైతుబంధు ప్రవేశపెట్టారు. అన్నం పెట్టే రైతన్న మరణిస్తే కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు బీమా ప్రవేశ పెడితే రేవంత్ రెడ్డి చమర గీతం పాడారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి దుర్మార్గమైన పాలనకు చరమ గీతం పాడాలని బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేదాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి ఛైర్పర్సన్ దావ వసంతసురేష్ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ లోక బాపురెడ్డి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఎల్లల శ్రీకాంత్ రెడ్డి ఓరుగంటి రమణరావు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో పనుల ప్రణాళిక సిద్ధం చేయాలి

అభివృద్ధి పనుల ప్రణాళికపై ఎంపీడీవో శ్రీధర్ సమీక్ష



**తానూర్:12అక్టోబర్(తెలంగాణ పత్రిక):** 2026-27 ఆర్థిక సంవత్సరానికి వి.బి.జి. రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో చేపట్టే పనుల ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో శ్రీధర్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫారం పాండ్, బోరుబావుల తవ్వకం, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని, జాబ్ కార్డులు లేని వారికి అందించి ఉపాధి కల్పించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. గ్రామాల పరిశుభ్రతతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏపీఓ శివలింగం,ఆయా గ్రామ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య, దోపిడీ కేసు ఛేదింపు: జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర




**కామారెడ్డి , అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి పట్టణంలోని ముష్రీఫ్ బాగ్‌కు చెందిన చిట్మల్ అనసూయ (66) హత్య కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. సెప్టెంబర్ 29న సాయంత్రం 6 నుంచి 7.30 గంటల మధ్య ఇంట్లో ఒంటరిగా ఉన్న అనసూయను హత్య చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. భర్త బయటకు వెళ్లి వచ్చేసరికి ఆమె మంచం పై అపస్మారక స్థితిలో పడి ఉండటం, మెడపై గాయాలు, పుస్తెల తాడు, ఉంగరాలు, చెవి ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో, పట్టణ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. మృతురాలి ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న రజితపై అనుమానంతో గంజ్ పాఠశాల సమీపంలో ఆమెను, ఆమె భర్త నర్సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. పోలీసుల విచారణలో డబ్బు కోసం బంగారం దోచుకోవాలని పథకం వేసి, గుర్తుపడుతుందనే భయంతో హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. పూజ చేస్తున్న సమయంలో కరెంట్ ఆపేసి ఆమెను మరో గదిలోకి లాగి తువ్వాలుతో గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం నేరం బయటపడకుండా యథావిధిగా పనికి వస్తూ నటించింది. అంతేకాకుండా రజిత 2023లో కామారెడ్డిలోని భూమయ్య ఇంట్లో పనిచేసే సమయంలోనూ 4 తులాల బంగారు పుస్తెల తాడు, 5 గ్రాముల చెవి కమ్మలు దొంగిలించినట్లు విచారణలో తేలింది. నిందితులు బతుకమ్మ కుంటకు చెందిన బోసు రజిత (40), బోసు నర్సింగ్ (48)లను అరెస్ట్ చేసి వారి నుంచి బంగారు పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలు (మొత్తం 8 తులాలు), సెల్ ఫోన్ ను స్వాధీనం చేసు కున్నట్లు వారు తెలిపారు.

# గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజా ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శ్రీ

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం




**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 12:** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదుల పై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదుల పై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# డి ఫ్లోరైడ్ వాటర్ ట్యాంకు ప్రహరీ గోడను కూల్చివేసి జిపికి అప్పగించండి



**కామారెడ్డి ,అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో పలుగడ్డ ప్రాంతంలో గల డీఫ్లోరైడ్ వాటర్ ట్యాంక్ దాని ప్రహరీ గోడను కూల్చేసి గ్రామపంచాయతీకి అప్పగించాలని సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఐరన్ నరసయ్య గ్రామ కార్యదర్శి యాదగిరిలు ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక చేనేత సహకార సంఘం చైర్మన్ బత్తిని సిద్ధ రాములు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 11:** జయశంకర్ భూపాలపల్లి సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, పూల సంబరాలకు, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పండుగ విశిష్టతను భావితరాలకు తెలియజేస్తూ, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, జిల్లా అధికారులు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామాజీపేట వెలమ సంఘం అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



**రాయికల్ మండల అక్టోబర్ 12(తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోనీ రామాజీపేట వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి వ్యాపారవేత్త ఉడుతల భాస్కరరావు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. వెలమ సంఘాల అభివృద్ధి, సామాజిక ఐక్యతే లక్ష్యంగా ఆయన అందించిన ఈ విరాళం పట్ల రామాజీపేట వెలమ సంక్షేమ సంఘం సభ్యులు, వెలమ బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 11న నిర్వహించిన రాష్ట్ర వెలమ ఆత్మీయ సమ్మేళనంలో ఉడుతల భాస్కరరావు పాల్గొన్నారు. సామాజిక వర్గ అభ్యున్నతి, సంఘాల అభివృద్ధి, సమాజంలో ఐక్యత పెంపొందించేందుకు భాస్కరరావు నిరంతరం కృషి చేస్తున్నారని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇచ్చిన మాట ప్రకారం రామాజీపేట వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం రూ. 2 లక్షలు అందించి తమకు అండగా నిలిచారని తెలిపారు. సంఘం అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, సామాజిక సేవలో భాగస్వాములవుతున్న ఉడుతల భాస్కరరావుకు రామాజీపేట వెలమ సంక్షేమ సంఘం తరఫున సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ సంఘం అభివృద్ధికి ఇలాంటి సహకారం కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు యాచమనేని వెంకట రామారావు, జకిలేటి రాజ శేఖర్ రావు, యాచమనేని అజయ్ రావు, దుగ్యాల రామ్ సాగర్ రావు, దుగ్యాల వేణు రావు తదితరులు పాల్గొన్నారు.

## సేవా భారతి ఫౌండేషన్‌ను అభినందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్ ప్రతినిధి అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని సుల్తాన్ పల్లి వృద్ధాశ్రమా ప్రాంగణంలో సేవా భారతి ఫౌండేషన్ నూతనంగా ఏర్పాటు చేసిన అనాధాశ్రమాన్ని రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ అనాధ చిన్నారులకు అండగా నిలుస్తున్న సేవా భారతి ఫౌండేషన్ ను ఆయన అభినందించారు. తల్లిదండ్రులు లేని అనాధ చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో వారికి అవసరమైన సదుపాయాలు అందించి వారికి అండగా సేవా భారతి ఫౌండేషన్ ముందుకు రావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## మోడికి కెసిఆర్ గతే: పొంగులేటి



**హైదరాబాద్ :** ప్రజల గొంతు నొక్కిన పాలకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి, ప్రతి రాజకీయ పార్టీకి రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ ఒక వేదికగా ఉండేదని గుర్తు చేశారు. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజల నిరసన హక్కును కాలరాస్తూ ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్‌ను ఎత్తివేసిందని విమర్శించారు. నిరసన తెలిపే అవకాశం లేకుండా చేసిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. కేసీఆర్ అనుసరించిన అదే విధానాన్ని ఇప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని పొంగులేటి విమర్శించారు. ఢిల్లీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు చారిత్రకంగా ఉపయోగించుకున్న జంతర్‌మంతర్ వంటి నిరసన వేదికలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కేసీఆర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిరసన వేదికను తొలగిస్తే, కేంద్ర ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు ఆంక్షలు విధిస్తోందని, ఇద్దరి ఆలోచనా విధానం ఒక్కటేనని మంత్రి మండిపడ్డారు. ప్రజల సమస్యలను వినకుండా, ప్రతిపక్షాల గొంతును వినిపించకుండా, నిరసనలకు వేదిక లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజల గొంతును అణచివేయాలని చూసిన కేసీఆర్‌కు ఎలాంటి రాజకీయ పరిణామం ఎదురైందో.. అదే పరిస్థితి భవిష్యత్తులో ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఎదురవుతుందని హెచ్చరించారు.

# ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే ప్రతికూల వాతావరణ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి






రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క..

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 12:** ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై పడే ప్రభావం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు సోమవారం ఢిల్లీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రపంచ వాతావరణ సంస్థ నివేదికల ప్రకారం ఎల్‌నినో ప్రభావం డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకుని, 2027 వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను అంచనా వేయకుండా రైతులు పంటలు సాగుచేసి నష్టపోవద్దని, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగంలో ముందస్తు కార్యాచరణ రూపొందించి, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించడం వల్ల రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల మేర వరి సాగు తగ్గిందని తెలిపారు. రానున్న రబీ సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా పప్పుదినుసులు, నూనెగింజలు, తక్కువ కాలపరిమితి కలిగిన పంటలను సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి వనరుల వాస్తవ పరిస్థితులను వివరించి, అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంటల ఎంపికలో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖల అధికారులు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న చర్యలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ కు కొంపల్లి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఉద్యాన పంటలు, నూనెగింజలు తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా వ్యవసాయ పెట్టుబడులపై నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, ప్రత్యామ్నాయ పంటల వివరాలను వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు నిరంతరం అందించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ, అధికారి బాబూరావు, ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ సదానందం, సీపీఓ కృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ మార్కెటింగ్ పేరుతో ఆర్థిక మోసాల ఆరోపణలు విచారణకు ప్రజల డిమాండ్

కరెంటు బైక్ షోరూమ్‌లు, అయస్కాంత పరుపుల వ్యాపారంలో పెట్టుబడులపై అనుమానాలు



**సూర్యాపేట, అక్టోబరు 12, తెలంగాణ పత్రిక, జిల్లా ప్రతినిధి:** కరెంటు బైక్ షోరూమ్‌లు ఏర్పాటు చేస్తామని, అధిక కమిషన్లు వస్తాయని నమ్మబలికి పలువురి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు గార్లపాటి వీరారెడ్డిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే హ్యాపీ లైఫ్ అయస్కాంత పరుపులు, బ్రాస్లెట్లు, వాటర్ బాటిళ్ల విక్రయాల్లోనూ మల్టీ లెవెల్ మార్కెటింగ్ విధానం ద్వారా ప్రజలను ఆకర్షించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. షోరూమ్‌ల ఏర్పాటుకు ఇచ్చిన పెట్టుబడులు తిరిగి రాక కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. చైన్ మార్కెటింగ్ విధానంలో అధిక లాభాల ఆశ చూపి ప్రజల నుంచి డబ్బులు సేకరించిన వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. కరెంటు బైక్‌ల అనుమతులు, నాణ్యత, సంబంధిత సంస్థల చట్టబద్ధతపై కూడా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక విచారణ వివరాలు, సంబంధిత వ్యక్తుల వివరణ అందుబాటులో లేవు. ఆరోపణల్లో వాస్తవాలను నిర్ధారించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పనులు చేస్తామని చెప్పాను కదా

మళ్లీ ఈ డ్రామాలేంది?'.. మున్సిపల్ కమిషనర్ అసహనం



**కామారెడ్డి , అక్టోబర్ 12, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద రోడ్డు, డ్రెయినేజీ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ రూ. 2 కోట్లు మంజూరు చేశారు. అయితే నిధులు మంజూరై 8 నెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కావడం లేదని ఆరోపిస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట భైఠాయించారు. సుమారు గంట తర్వాత ప్రజావాణి ముగించుకుని వచ్చిన కమిషనర్ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. టెండర్ క్యాన్సిల్ కావడంతో పనులు ఆలస్యమయ్యాయని తెలిపి, అక్కడికక్కడే షబ్బీర్ అలీకి ఫోన్ చేసి వారితో మాట్లాడించారు. మరోసారి ప్రపోజల్ పెట్టి టెండర్ వేయించి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చి, సంబంధిత పత్రాలు చూపిస్తానని తన ఛాంబర్‌కు రావాలని సూచించారు. దీంతో కొంతమంది ఛాంబర్‌కు వెళ్లగా, 'అక్కడే మాట్లాడాను కదా.. మళ్లీ ఎందుకొచ్చారు' అని అనడంతో వారికి, కమిషనర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం కార్యాలయం బయటకు వచ్చిన కమిషనర్‌ను వాసులు మరోసారి చుట్టుముట్టి నిలదీయడంతో సహనం కోల్పోయారు. 'నాకేం పనులు లేవనుకుంటున్నారా.. మీ కోసమే ఉంటానా.. అప్పుడే చెప్పాను కదా పనులు చేస్తామని ఏంటి ఈ డ్రామాలు' అంటూ అసహనం వ్యక్తం చేశారు.

## శంషాబాద్ పరిధిలో వ్యక్తి అదృశ్యం



**రాజేంద్రనగర్ ప్రతినిధి అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక:** వ్యక్తి అదృష్టమైన సంఘటన శంషాబాద్ ఆర్. జి ఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం నాడు చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ పట్టణంలోని స్వాతం రాయ్ ప్రాంతానికి చెందిన పాత్య సుభాష్ కనబడుటలేదని అతని ఆచూకీ లభించిన వారు శంషాబాద్ ఆర్జిఐఏ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు లేదా 8712663319 ,, 8712510744 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆర్ జి ఐ ఏ పోలీసులు సూచించారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగి సాగుపై అప్రమత్తంగా ఉండాలి

రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రైతులకు సూచన



**గంపరావుపేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోటు, భూగర్భ జలాలు సాగునీటి లభ్యతపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో రైతులు యాసంగి పంటల సాగుపై ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచించారు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో నేరుగా మాట్లాడి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, రాబోయే యాసంగి సాగు ప్రణాళికలపై చర్చించారు ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగుపై పునరాలోచన చేయాలని సూచించారు. నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా సాగు విరామం (క్రాప్ హాలిడే) పాటించే అంశాన్ని పరిశీలించాలని, తద్వారా పెట్టుబడులు పెట్టి నష్టపోయే ప్రమాదాన్ని తగ్గించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు స్వల్పకాలిక పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు వర్షపాతం, భూగర్భ జలాలు, ప్రాజెక్టులు మరియు చెరువుల్లో నీటి నిల్వలను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని, రైతులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు సూచించారు ఈ వీడియో కాన్ఫరెన్స్ నర్మాల లింగన్నపేట మల్లారెడ్డిపేట రైతు వేదికల్లో రైతులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొని రైతులకు ముందస్తు అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేయడం, సమన్వయంతో చర్యలు చేపట్టడంపై చర్చించారు రైతులు ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పంటల సాగుకు ముందు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ హనుమంతు నాయక్ తాహసిల్దార్ మారుతురెడ్డి మండల వ్యవసాయ అధికారి సలావుద్దీన్ ఏఈఓ ప్రవీణ్ సర్పంచ్ లు ఉప ఉప సర్పంచ్లు రైతులు పాల్గొన్నారు.



## అనాధ ఆశ్రమంలో అన్నదానం

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో




**గంభీరావుపేట తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో దేవి నవ రాత్రులు పురస్కరించుకొని మండల కేంద్రంలోని మా వృద్ధుల అనాద ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు సంకెపల్లి సుమలత శర్మ, సుధాకర్ శర్మ టిఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు సయ్యద్ సాదిక్, మైనారిటీ మండల నాయకులు అస్లాం ఖాన్, మక్బుల్ ఖాన్, అంజయ్య, సమి తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలి





**తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**అన్ని జిల్లాల కలెక్టర్లు, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడిన డిప్యూటీ సీఎం**

**సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదిక నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 12, తెలంగాణ పత్రిక:** సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని సమష్టిగా ఎదుర్కోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. జిల్లాలోని రైతు వేదికల నుంచి రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయని, సాగునీటి లభ్యత పరిమితంగా ఉండటంతో రైతులు యాసంగి 202627 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని, ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలను పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ, రానున్న జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పశుసంపదను కాపాడుకోవాలి. పశు సంపదను కూడా రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. పశువులకు తగినంత తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి నుంచే రైతులకు అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ముందస్తు అవగాహన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గిందని, మహబూబ్‌నగర్ ప్రాంతంలో కూరగాయల సాగు పెరిగిందని వివరించారు. యాసంగిలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుపై రైతులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగాన్ని పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రైతులు తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు, అందుబాటులో ఉన్న నీటి వివరాల ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. యూరియా, విత్తనాల లభ్యతకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. పంటలకు నీటి సరఫరా, విద్యుత్ లభ్యతపై అధికారులు రైతులకు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమాచారం అందించాలని సూచించారు. ఏ ప్రాంతంలో ఎంత నీరు అందుబాటులో ఉంది, ఎంత విద్యుత్ సరఫరా చేయగలమనే వివరాలను స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు థర్మల్ విద్యుత్ కేంద్రాలు గరిష్ట సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, సౌర విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గి, కరువు పరిస్థితులు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ ప్రభావం మరింత బలపడవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఖరీఫ్ సాగు విస్తీర్ణం 15 శాతం తగ్గిందని వివరించారు. పత్తి, వరి పంటలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, రైతు భరోసా కింద 75 లక్షల మంది రైతులకు రూ. 8,500 కోట్ల నిధులు విడుదల చేశామని, లక్ష ఎకరాలకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశామని, ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనాలు అందించామని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని, 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని సీఎస్ సూచించారు. గత ఏడాది రోజుకు సగటున 25 వేల మంది కూలీలు పనులకు హాజరుకాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందని తెలిపారు. నెలాఖరుకు రోజువారీ కూలీల హాజరును 5 లక్షలకు పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి సంరక్షణ పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి నిల్వ నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, వ్యక్తిగత, సామూహిక సోక్ పిట్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని సూచించారు. పశువులకు మేత అందుబాటును పెంచే పనులను చేపట్టాలని తెలిపారు. మార్చి 2027 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనంగా రూ. 6,500 కోట్ల మేర పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 20 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రాల్లో గతంలో 3,750 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కాగా, ఈ ఏడాది సుమారు 930 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి అయిందని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతో పాటు మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. భారత వాతావరణ శాఖ నిపుణురాలు డాక్టర్ ఎ. శ్రావణి మాట్లాడుతూ, ప్రస్తుతానికి తెలంగాణలో చెప్పుకోదగిన వర్షాలు కురిసే అవకాశం లేదని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వ సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసాయని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వెల్లడించారు. వేడి వాతావరణంతో గృహ ఇతర అవసరాలకు విద్యుత్ వినియోగం సాధారణంకంటే దాదాపు 25 శాతం ఎక్కువ పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన సాగు నీటి ప్రాజెక్టులలో ఆశించిన స్థాయిలో నీటి మట్టం లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోయిందని పేర్కొన్నారు. ప్రాజెక్టులలో ఉన్న నీరు ప్రస్తుతం తాగు నీటికి, పశు సంపద సంరక్షణకు వినియోగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు నీటి వృథాను అరికట్టాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. వరికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న, ఆముదం, నువ్వులు, శెనిగెలు, పొద్దు తిరుగుడు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు కోరారు. ఉద్యానవన పంటల సాగు కోసం డ్రిప్ ఇరిగేషన్ వాడాలని సూచించారు. మంచి దిగుబడి.. ఆయిల్ పామ్, కూరగాయలు సాగు చేస్తున్న పలువురు రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. వీర్నపల్లి మండలానికి చెందిన రైతు రాములు నాయక్ మాట్లాడుతూ.. ఐదు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నానని, దిగుబడి మంచిగా వస్తుందని వివరించారు. నీటి వినియోగం, విద్యుత్ వాడకం చాలా తక్కువ ఉందని తెలిపారు. పర్యావరణ ఇబ్బందులు కూడా రావని పేర్కొన్నారు. బీరకాయ, సొరకాయ, టమాటాలు, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్నానని తంగళ్లపల్లి మండలం దేశాయ్ పల్లి రైతు రమేష్ తెలిపారు. వరికి బదులుగా కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం వస్తుందని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీధర్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, నీటి పారుదల శాఖ, ఎన్పీ డీసీఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

ఎస్పీ అభినందనలు



**మల్యాల: తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి నిందితులను పట్టుకోవడంతో జిల్లా ఎస్పీ పోలీసు సిబ్బందిని అభినందించారు. మల్యాల మండలంలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైన ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు కేసును ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి చోరీకి సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మల్యాల సిఐ రాజ్ కుమార్, ఎస్ఐ సందీప్, కానిస్టేబుల్ లు రాజేందర్, ఆంజనేయులు, విక్రాంత్ లను జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని పేర్కొన్నారు.

## సోంపూర్ గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**పోతంగల్ తెలంగాణ పత్రిక అక్టోబర్ 12:** పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ పవర్ కోమల్ సంజీవ్ పటేల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు చిన్నారులు నూతన వస్త్రాలను ధరించి బతుకమ్మలను రంగు రంగుల పూలతో పేర్చి గోబీయ్యాలు వేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచులకు గ్రామంలోని ఆడపడుచులకు చిన్నారులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు ఆత్మ గౌరవాన్ని పెంపొందించే పండగలో ఒకటి పవిత్రమైన పండగ బతకమ్మ పండగని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోమల్ సంజీవ్ పటేల్, ఉపసర్పంచ్ ఔసాజి, గ్రామ పెద్దలు, పవర్ శంకర్ పటేల్, బాబు పటేల్, శివాజీ పటేల్, మంగలి వెంకటి, జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పోచిరాం, సోన్ కామ్లే కమలాకర్, సిందే అశోక్ పటేల్, జగదీష్, సాయినాథ్, చాకురే గంగాధర్, సిందే వసంతరావు, గ్రామ మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తా

డాక్టర్ కాపా చంద్రకళ



**ఖమ్మం ప్రతినిధి: వైరా అక్టోబరు 12 (తెలంగాణ పత్రిక):** వైరా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని పురపాలక సంఘ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ పేర్కొన్నారు. వైరా పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశం జరిగింది ఈ సమావేశంలో వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ, మెరుగైన సేవలుఅందించేందుకు , పురపాలక అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు వైరా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి నా ధ్యేయం అని . కాపా చంద్రకళ స్పష్టం చేశారు రాజకీయాలకతీతంగా వైరాని తీర్చిదిద్దుతానని ఆమె పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాల పట్టణ అభివృద్ధి నడిపించడం వైరా పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతూ, తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఉండ్రు వరలక్ష్మి ముళ్ళపాటి విజయలక్ష్మి పణితి సైదులు చింత నిప్పు సులోచన నిమ్మ తోట శ్రావణి మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు మునిసిపల్ మేనేజర్ సుధీర్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.20 లక్షలతో ఏసీబీకి చిక్కిన తహసీల్దార్!




**హైదరాబాద్:** లంచం తీసుకుంటూ అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. రూ. 20 లక్షలు తీసుకుంటుండగా అధికారులు ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో పాటు సర్వేయర్ శ్రీనివాసులును కూడా ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే, ఈ లంచం వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సంత్ శ్రీ ఆశారామ్ జీ ఆశ్రమం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం





**రాజేంద్రనగర్ ప్రతినిధి, అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక:** దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సంత్ శ్రీ ఆశారామ్ జీ బాపూ ప్రేరణతో శ్రీ యోగ వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని 198 మంది కార్మికులకు స్టీల్ పాత్రలు, చీరలు, చలి నుంచి రక్షణకు జాకెట్లు, సత్ సాహిత్య గ్రంథాలు, లాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం సామూహిక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నార్సింగి మార్కెట్ మాజీ చైర్మన్ డి. వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులకు వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిస్వార్థ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ యోగ వేదాంత సేవా సమితి అధ్యక్షుడు ముక్తియార్ సింగ్, ఉపాధ్యక్షుడు జేశురాజ్ బాలాపూర్ తదితర సేవాదారులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వ్యవసాయ వర్సిటీలో మూడో విడత కౌన్సెలింగ్

14, 15 తేదీల్లో నిర్వహణ

**హైదరాబాద్ :** ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మిగిలిన బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ సీట్ల భర్తీకి ఈ నెల 14, 15 తేదీల్లో మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య తెలిపారు. 16న బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ ప్రత్యేక కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. సీట్లు, రుసుములు, ధ్రువపత్రాలు.. తదితర వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.pjtau.edu.in సందర్శించాలని సూచించారు.

## బీసీ కులగణన కోసం వచ్చే నెల 15న చలో ఢిల్లీ

జాతీయ ఓబీసీ సమాఖ్య సమావేశంలో నిర్ణయం




**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా జనగణనలో బీసీ కులగణన చేపట్టాలనే డిమాండ్ సాధన కోసం నవంబరు 15న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించాలని జాతీయ ఓబీసీ సమాఖ్య నిర్ణయించింది. సమాఖ్య కన్వీనర్ ఉమేశ్ కొర్రం అధ్యక్షతన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో సమాఖ్య జాతీయ నేతలు సూరజ్ యాదవ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్రయాదవ్, ఆర్జేడీ కార్యదర్శి ధర్మేంద్ర కుష్వా, మహారాష్ట్ర సీఎల్పీ నేత విజయ్ వాడెట్టివార్, జాతీయ సలహాదారు, తెలంగాణ మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కర్ణాటక అధ్యక్షుడు యద్యూరప్ప, మధ్యప్రదేశ్ నేత బజేంద్ర యాదవ్, అన్ని రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

## డ్రగ్స్ టెస్ట్‌కు బ్లడ్ శాంపిల్స్ ఇచ్చిన నేతలు




**హైదరాబాద్ :** డ్రగ్స్ టెస్ట్ కోసం తమ బ్లడ్ శాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపుతున్నామని పశు గణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగరి గారి ప్రీతం తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో వారు తమ రక్తనమూనాలను ప్రయోగశాలకు పంపుతున్నట్లు మీడియాకు చూపించి వివరాలు తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, తమ వైట్ ఛాలెంజ్‌ను స్వీకరించి భారాస నాయకులు కూడా డ్రగ్స్ టెస్ట్ కోసం బ్లడ్ శాంపిల్స్ ఇవ్వాలని వారు సవాల్ చేశారు.

RNI No. APTEL/2008/23068
తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in



## ములుగులో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణకు రూ.3 కోట్లు మంజూరు

సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది అక్టోబరు 12:** ములుగు నియోజకవర్గంలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి మేరకు ఇంధన శాఖ ఈ నెల 8న ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 32 జారీ చేసింది. నివాస గృహాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భద్రతాపరమైన సమస్యలను మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాల ముప్పును తగ్గించేందుకు విద్యుత్ లైన్లను మార్చాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ సమ్మతితో జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి సీతక్క చొరవతో మంజూరైన ఈ నిధులతో విద్యుత్ లైన్ల మార్పు పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లతో ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గి, ప్రజలకు భద్రత పెరగనుంది. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించి వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందించాలి

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



**రాజేంద్రనగర్ ప్రతినిధి అక్టోబర్ 12 తెలంగాణ పత్రిక:** రాజేంద్రనగర్ నియోజకవర్గం నెక్నాపూర్ డివిజన్ పరిధిలో హల్కాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తనిక్యా సిల్క్స్ అండ్ సారీస్ షోరూంను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, సినీ నటి మేఘనా తో కలిసి ఘనంగా ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ షాపు యజమానులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించి, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బాలిక హత్య కేసును ఛేదించిన పోలీసులు




**హైదరాబాద్ :** బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్య కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు. గేటెడ్ కమ్యూనిటీలో పనిచేసిన సెక్యూరిటీ గార్డే హత్య చేసినట్లు గుర్తించిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. దసికింద్రాబాద్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొల్లారం పరిధిలోని సీడ్ వరక్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న మిల్టన్ ఫెర్నాండెజ్ మోసెస్‌కు కుమారుడు, కుమార్తె ఆరేలియా(5) అలియాస్ మోను ఉన్నారు. బాలిక ఆరేలియా అక్టోబర్ 10న సాయంత్రం కిడ్నాప్ అయింది. రోజు ఆరేలియా గేటెడ్ కమ్యూనిటీలోని క్లబ్ హౌస్ వద్ద సైకిల్‌తో ఆడుకుని ఇంటికి 6 గంటల వరకు వచ్చేంది. ఆ రోజు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కమ్యూనిటీ మొత్తం వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే అదే రోజు రాత్రి 7.45 గంటల సమయంలో ఓ వ్యక్తి బాలిక తండ్రికి ఫోన్ చేసి మీ కుమార్తెను కిడ్నాప్ చేశానని రూ. 20 లక్షలు ఇస్తే విడుదల చేస్తానని చెప్పాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రుల మాల్కాజ్‌గిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ తెలుసుకునేందుకు వెంటనే సిపి సుమతి పది బృందాలను రంగంలోకి దింపారు. ఎస్‌ఓటి, క్రైమ్స్, స్పెషల్ బ్రాంచ్‌లతో కూడిన పది ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభించకపోవండంతో సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేశారు. 4 గంటల్లో 130 సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు, అయినా ఎక్కడా చిన్నారి ఆచూకీ కనిపించకపోవడంతో గేటెడ్ కమ్యూనిటీ అంతా గాలించగా సెల్లార్‌లోని నీటితొట్టెలో చిన్నారి మృతదేహం కనిపించింది. అనుమానం వచ్చి పోలీసులు సెక్యూరిటీ గార్డులను విచారణ చేయగా అసలు నిజం బయటపడింది. బీహార్ రాష్ట్రం, నలందకు చెందిన విక్రం కుమార్ కమ్యూనిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. విధి నిర్వహణలో నర్లక్షంగా ఉండడంతో పనిలో నుంచి తీసివేశారు, దీనికి బాలిక తాత కారణమని కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 10వ తేదీన కమ్యూనిటీకి వచ్చిన విక్రం కుమార్ అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులకు తన ఉద్యోగం కోసం రిక్వెస్ట్ చేసేందుకు వచ్చానని చెప్పి లోపలికి ప్రవేశించాడు. క్లబ్ హౌస్ వద్ద ఆడుకుంటున్న బాలికను సెల్లార్‌లోకి తీసుకుని వెళ్లి కాళ్లు చేతులు కట్టివేసి నీటి సంపులో పడేసి హత్య చేసి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో సెక్యూరిటీ సిబ్బంది నేపథ్యాన్ని ధ్రువీకరించుకోవాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి సూచించారు. సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్, పని మనుషుల వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరవ రోజు అదుర్స్

విదేశీయులు, ప్రముఖుల సందర్శనతో
సారస్ మేలాలో సందడి
కాశ్మీర్ కార్పెట్ల నుంచి కేరళ మసాలాల
వరకు భారీ గిరాకీ
వెదురు ఉత్పత్తుల విక్రయాలతో
ఒకే రోజు రూ.లక్ష ఆదాయం
సీతాఫలాలకు పోటెత్తిన సందర్శకులు



**హైదరాబాద్:** హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న సారస్ మేలా ఆరవ రోజు సందర్శకులతో సందడిగా మారింది. రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విదేశీయులు, పలువురు ప్రముఖులు మేలాను సందర్శించి వివిధ స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. ఎమ్మెల్సీ వాణీదేవి సైతం మేలాలో స్టాళ్లను సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను పరిశీలించారు. కాశ్మీర్ ప్రత్యేకతను చాటే కార్పెట్ల నుంచి కేరళకు చెందిన సుగంధ ద్రవ్యాల వరకు అనేక రకాల ఉత్పత్తులకు కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. హస్తకళలు, గృహోపకరణాలు, సంప్రదాయ వస్తువులు, ఆహార ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు ఇలా విభిన్న ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులో ఉండటంతో సందర్శకులు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. మేలాలో విక్రయాలు ఆశాజనకంగా ఉండటంతో స్టాళ్ల నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ ఉత్పత్తులకు నగర వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతోపాటు, కొత్త మార్కెట్‌ను పరిచయం చేసుకునే అవకాశం కలుగుతోందని మహిళా వ్యాపారవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఒక్కరోజే సుమారు రూ. 90 లక్షల విక్రయాలు జరగగా 54,556 మంది సందర్శకులు మేలాను తిలకించారు. తద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు, హస్తకళలు, హస్త కార్మికులు, చిన్న వ్యాపారులు తమ ఉత్పత్తులను విస్తృతంగా ప్రదర్శించి మంచి ఆదాయం పొందారు.

**ఒకే రోజు రూ.లక్ష విలువైన వెదురు ఉత్పత్తుల విక్రయాలు**

మణిపూర్‌కు చెందిన మహిళా సంఘం ఏర్పాటు చేసిన వెదురు ఉత్పత్తుల స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. వెదురుతో రూపొందించిన అందమైన, ఉపయోగకరమైన వస్తువులకు మంచి గిరాకీ లభిస్తోంది. ఒక్క రోజులోనే సుమారు రూ.లక్ష విలువైన వెదురు ఉత్పత్తులను విక్రయించినట్లు ఆ స్టాల్ నిర్వాహకురాలు తెలిపారు.

**సీతాఫలాలకు పోటెత్తిన సందర్శకులు**

నారాయణపేట ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీతాఫల్ స్టాల్ ప్రారంభం కావడంతో మేలాలో మరో ప్రత్యేక ఆకర్షణ చేరింది. స్థానికంగా లభించే సీతాఫలాలను విక్రయానికి ఉంచగా సందర్శకులు పెద్ద సంఖ్యలో కొనుగోళ్లకు ముందుకొచ్చారు. కిలో సీతాఫలాలను కేవలం రూ. 100కే అందిస్తుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు. సీతాఫలాలతోపాటు వాటి గుజ్జును కూడా విక్రయానికి ఉంచడం విశేషం. పావు కిలో సీతాఫలం గుజ్జును రూ. 75కు అందిస్తుండటంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా పండ్లతో పాటు వాటి విలువ ఆధారిత ఉత్పత్తులను కూడా నేరుగా వినియోగదారులకు పరిచయం చేయడం వల్ల రైతులకు మార్కెట్ అవకాశాలు విస్తరిస్తున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా ఇందిరా మహిళా శక్తి చీర**

మేలా ప్రాంగణంలో తెలంగాణ చేనేత, వస్త్ర సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తున్న ఇందిరా మహిళా శక్తి చీర సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఆ ఏడాది డిజైన్‌కు సంబంధించిన ప్రత్యేక చీరను తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్‌వీ ఆధ్వర్యంలో ప్రదర్శనకు ఉంచారు. మహిళా సాధికారతను ప్రతిబింబించే ఈ చీరను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించారు.

**మహిళల్లో చదువుపై అవగాహనకు ప్రత్యేక స్టాల్**

మహిళా సాధికారతకు ఆర్థిక స్వావలంబనతోపాటు విద్య కూడా కీలకమనే సందేశాన్ని అందించేందుకు సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సంయుక్తంగా ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశాయి. వివిధ కారణాలతో చదువును మధ్యలోనే నిలిపివేసిన మహిళలు తిరిగి విద్యను కొనసాగించేలా ప్రోత్సహించడం ఈ స్టాల్ ముఖ్య ఉద్దేశం. చదువు ప్రాముఖ్యతను వివరించడంతోపాటు చదువును కొనసాగించాలనే ఆసక్తి ఉన్న మహిళలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో మహిళలను నమోదు చేస్తూ వారు తిరిగి చదువుకునేందుకు అవసరమైన సమాచారాన్ని అందిస్తున్నారు. విద్య ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు కుటుంబ, సామాజిక జీవితాల్లో మరింత చురుకైన పాత్ర పోషించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.

**స్టాళ్ల నిర్వాహకులకు సెర్ప్ సిబ్బంది సహకారం**

మేలాకు తరలివస్తున్న సందర్శకులకు, స్టాళ్ల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెర్ప్ సిబ్బంది అవసరమైన సహకారం అందిస్తున్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడం, కొనుగోలుదారులను ఆకర్షించడం, విక్రయాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ కల్పిస్తూ, వారి నైపుణ్యాన్ని వ్యాపార అవకాశాలుగా మార్చేందుకు సరస్ మేలా వేదికగా నిలుస్తోంది. మహిళలు కేవలం ఉత్పత్తుల తయారీకే పరిమితం కాక మార్కెటింగ్, విక్రయాలు, వ్యాపార నిర్వహణలోనూ రాణించేలా ఈ మేలా ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

## తాగునీటికే తొలి ప్రాధాన్యం

యాసంగిలో వరి, పత్తి వద్దు- ఎల్-నినో ప్రభావంతో తీవ్ర జల, ఇంధన సంక్షోభం
రాబోయే 10 నెలలు అప్రమత్తంగా ఉండాలి: డిప్యూటీ సీఎం భట్టి
ఆరుతడి పంటలకే మొగ్గు చూపాలని మంత్రి తుమ్మల పిలుపు
రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రులు, ఉన్నతాధికారుల సమీక్ష



**హైదరాబాద్:** ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో తీవ్ర జల, ఇంధన సంక్షోభం పొంచి ఉందని, అందువల్ల ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటికి, పశువుల అవసరాలకే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ యాసంగి (రబీ) సీజన్‌లో వరి, పత్తికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేసింది. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్ సంజయ్ జాజు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎల్-నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం ఎల్-నినో ప్రభావం డిసెంబర్ నాటికి గరిష్ఠస్థాయికి చేరుకుంటుందని, 2027 వరకు ఈ పరిస్థితులు కొనసాగే ప్రమాదం ఉందన్నారు. రానున్న జూన్, జులై వరకు వర్షాలు కురిసే అవకాశం లేనందున నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తాగునీటి ఎద్దడి, పశుగ్రాసం కొరత రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ఆరుతడి పంటలకే సబ్సిడీ: మంత్రి తుమ్మల**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే 315 మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదైందని, అందువల్ల రైతులు వరి, పత్తి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. తక్కువ సమయంలో పండే ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీపై అందిస్తామని స్పష్టం చేశారు. పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉన్నతస్థాయి బృందాన్ని ఢిల్లీకి పంపుతామన్నారు.

**10 నెలలు తాగునీటికే ప్రాధాన్యం: సీఎస్**

రాష్ట్రంలో 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. కృష్ణా బేసిన్‌లో 270 టీఎంసీలకు గాను కేవలం 80 టీఎంసీలు, గోదావరిలో 150 టీఎంసీలకు గాను 100 టీఎంసీల నీరే వచ్చిందని వివరించారు. ఈ నేపథ్యంలో రానున్న 10 నెలలు వ్యవసాయానికి నీరు అందించే పరిస్థితి లేదని, కేవలం తాగునీటికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు.

**విద్యుత్ ఉత్పత్తి డౌన్.. పప్పు దినుసులకే సై**

జలాశయాల్లో నీరు లేకపోవడంతో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి 25 శాతానికి పడిపోయిందని, దేశవ్యాప్తంగా కూడా విద్యుత్ కొరత ఉందని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. మరోవైపు వాతావరణం సాధారణం కంటే 4 డిగ్రీలు అధికంగా వేడెక్కుతోందని అధికారులు హెచ్చరించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నీటిని తక్కువగా వినియోగించుకునే 4 రకాల పప్పు దినుసులు (పెసలు, మినుములు, శనగలు, వేరుశనగ), 4 రకాల నూనెగింజల (సన్‌ఫ్లవర్, నువ్వులు, కుసుమ) సాగుపైనే రైతులు దృష్టి సారించాలని, వరికి 'క్రాప్ హాలిడే' ప్రకటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. రాష్ట్రంలోని 1.39 కోట్ల జీవాలకు ఎమర్జెన్సీ క్యాంపుల ద్వారా తాగునీరు, పశుగ్రాసం అందిస్తామని పశుసంవర్ధక శాఖ తెలిపింది.

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

**న్యూ ఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. గవర్నర్ల బదిలీలు, కొత్త నియామకాల్లో భాగంగా కేరళం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడుకు బదిలీ చేశారు. ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ సోమవారంనాడు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకారం సిక్కిం కొత్త గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్ నియమితులయ్యారు. జార్ఖండ్‌కు చెందిన బీజేపీ నేత బ్రజ్ మోహన్ రామ్‌ను ఒడిశా గవర్నర్‌గా నియమించారు. ఇతర నియామకాల్లో భాగంగా డాక్టర్ సుధా యాదవ్‌ను కర్ణాటక గవర్నర్‌గా, డాక్టర్ ధల్ సింగ్ బిసేన్‌ను ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమించారు.

## జర్నలిస్టుల సమస్యలపై ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక

స్థలం లీజు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, పెన్షన్ల కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి

**హైదరాబాద్:** జర్నలిస్టులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమాజిగూడలో ఆదివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రెస్ క్లబ్ సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు హాజరయ్యారు. ఏడాది కాలంలో మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించి, ఘనంగా నివాళు లర్పించారు. ప్రెస్ క్లబ్ స్థలం లీజును వెంటనే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్ క్లబ్ ఏజీఎం ఏకగ్రీవంగా తీర్మానించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇందుకోసం అన్ని జర్నలిస్టు సంఘాలు, యూనియన్లను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, వ-యోధిక పాత్రికేయులకు పెన్షన్లు ఇవ్వాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రెస్ క్లబ్ ఏజీఎం తీర్మానించింది. మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యుడి కుటుంబానికి రూ. 50 వేలు ఆర్థిక సహాయం తక్షణం అందజేయాలని సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

## తెలంగాణ-హిరోషిమా మధ్య సహకారం బలోపేతం కావాలి

ఉపాధి అవకాశాల విస్తరణకు కృషి చేయాలి
హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులతో సీఎస్ సంజయ్ జాజు సమావేశం
కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ వివేక్ ప్రారంభోపన్యాసం



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి, జపాన్‌లోని హిరోషిమా ప్రభుత్వానికి మధ్య పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన రంగాల్లో పరస్పర భాగస్వామ్యానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులతో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలు, పెట్టుబడులకు అనుకూలమైన రంగాల గురించి వివరించారు.

**తెలంగాణ అభివృద్ధి సామర్థ్యాలు**

రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి వివరించారు. ముఖ్యంగా కింది రంగాల్లో ఉన్న అవకాశాలను ప్రతినిధి బృందం దృష్టికి తీసుకొచ్చారు. క్యూర్ రీజియన్ : హైదరాబాద్ ప్రధాన పట్టణ ప్రాంతంలో సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ. ప్యూర్ రీజియన్ : నగర పరిసర ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు ప్రోత్సాహం. రేర్ రీజియన్ గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ ఆధారిత రంగాలు, విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి. ఓఆర్ఆర్ ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లో రవాణా అనుసంధానం, పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధికి అవకాశాలు. భారత్ ఫ్యూచర్ సిటీ: ఆధునిక నగర నిర్మాణం, అంతర్జాతీయ పెట్టుబడులు, సాంకేతికత ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యం. డేటా సెంటర్లు: డిజిటల్ మౌలిక సదుపాయాలు, డేటా నిల్వ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలను పెంపొందించడం.

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

తెలంగాణ విజన్ 2047లో భాగంగా, 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యాన్ని ప్రధాన కార్యదర్శి వివరించారు. ఈ లక్ష్య సాధనలో అంతర్జాతీయ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పారిశ్రామిక విస్తరణ, నైపుణ్యాభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే జపాన్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమలు, డేటా సెంటర్లు, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన వంటి రంగాల్లో పరస్పర అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

**తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ కార్యక్రమంలో హిరోషిమా ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయడంతో పాటు, జపాన్ సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ, హిరోషిమా మధ్య సన్నిహిత సంబంధాలు రెండు ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి, సాంకేతిక సహకారానికి, యువతకు నూతన ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడతాయని ప్రధాన కార్యదర్శి ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, వీటీజీఐఎస్ వీణ శశాంక, తదితరులు పాల్గొన్నారు.

## నానక్‌రామ్‌గూడలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



**హైదరాబాద్ :** నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో వుప్పల భరత్ (29) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అపార్ట్‌మెంట్ పై నుంచి కిందపడిన ఘటన చోటుచేసుకుంది. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం స్టార్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువు వుప్పల కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. భరత్ కిందపడటానికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Editor, Printer, Publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1, Auto Nagar, village Bommakal, Mdl and District: Karimnagar - 500001. Telangana State, Published at H. NO. 9-10/7A Krishna Nagar, Bommakal Village Mdl and District Karimnagar 505001, Telangana State, Editor : B. VENKATESHAM Cell : 8341110143